జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు?

● బాబుతో అయ్యన్న భేటీ



అమరావతి,మహానాడు:
ఏపీ స్పీకర్‌గా టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నియమితులు కానున్నట్లు సమాచారం. మంత్రివర్గంలో స్థానం కోల్పోయిన పాత్రుడుకు స్పీకర్ పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అటు పార్టీ క్యాడర్ సైతం.. విపక్షంలో ఉన్నప్పుడు జగన్ సర్కారుపై పోరాడి, వేధింపులకు గురైన అయ్యన్నకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై పార్టీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమయింది. కాగా తాజాగా అయ్యన్నను సీఎం చంద్రబాబు పిలిపించి మాట్లాడారు. నేడో, రేపో అయ్యన్న పేరు స్పీకర్ పేరు ప్రకటించే అవకాశం ఉందంటున్నారు.

# కొత్త మంత్రులకు శాఖలు కేటాయింపు

● పవన్‌కు పంచాయితీరాజ్
● కేశవ్‌కు ఆర్థిక శాఖ
● సత్యకుమార్‌యాదవ్‌కు ఆరోగ్యం
● సత్యప్రసాద్‌కు రెవిన్యూ
● పార్థసారథికి సమాచారశాఖ
● కొల్లు రవీంద్రకు మైనింగ్
● అనితకు హెూం
● బీజేపీకి కీలక శాఖ
● బీసీ, ఎస్సీలకు కీలక శాఖల కేటాయింపు



విజయవాడ:
మంత్రులకు శాఖలు కేటాయించారు. వీరిలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంతోపాటు పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, బీజేపీ నుంచి గెలిచిన సత్యకుమార్‌యాదవ్‌కు ఆరోగ్యశాఖ, పయ్యావుల కేశవ్‌కు ఆర్థికశాఖ, అనగాని సత్యప్రసాద్‌కు కీలకమైన రెవిన్యూ, కొల్లు రవీంద్రకు మైనింగ్, అనితకు హెూంశాఖలు దక్కాయి. మొత్తంగా చూస్తే బీసీ-ఎస్సీలకు చంద్రబాబు కీలక శాఖలు కట్టబెట్టినట్లు స్పష్టమయింది.

### మంత్రులు- వారి శాఖలు

**నారా చంద్రబాబు** : ముఖ్యమంత్రి
**పవన్ కల్యాణ్** : డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు
**నారా లోకేష్** : మానవ వనరులు అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖలు
**అచ్చెన్నాయుడు** : వ్యవసాయశాఖ
**నాదెండ్ల మనోహర్** : ఆహారం, పౌరసరఫరాల శాఖ
**వంగలపూడి అనిత** : హెూం మంత్రిత్వ శాఖ
**పొంగూరు నారాయణ** : పురపాలకశాఖ, పట్టణాభివృద్ధి
**సత్యకుమార్ యాదవ్** : ఆరోగ్యశాఖ
**నిమ్మల రామానాయుడు** : నీటిపారుదల శాఖ
**మహ్మద్ ఫరూఖ్** : న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమం
**ఆనం రామనారాయణరెడ్డి** : దేవాదాయ శాఖ
**పయ్యావుల కేశవ్** : ఆర్థిక శాఖ
**అనగాని సత్యప్రసాద్** : రెవెన్యూ శాఖ
**కొలుసు పార్థసారథి**: హౌసింగ్, I&PR శాఖలు
**డోలా బాలవీరాంజనేయస్వామి**: సాంఘిక సంక్షేమ శాఖ
**గొట్టిపాటి రవికుమార్** : విద్యుత్ శాఖ
**కందుల దుర్గేష్** : పర్యాటకం, సాంస్కృతిక శాఖలు
**గుమ్మడి సంధ్యారాణి** : స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖలు
**బీసీ జనార్ధన్** : రహదారులు, భవనాల శాఖలు
**టీజీ భరత్**: పరిశ్రమల శాఖ
**ఎస్.సవిత** : బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖలు

# పల్లాకు పార్టీ పగ్గాలు

● యాదవుల చేతికి టీడీపీ సారథ్యం
● పల్లా మెజారిటీకి బాబు గుర్తింపు
● మళ్లీ ఉత్తరాదికే దక్కిన టీడీపీ అధ్యక్ష పదవి

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు అద్భుత విజయానికి, తగిన గుర్తింపు-గౌరవం లభించింది. మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై 95,235 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన పల్లాకు, మంత్రివర్గంలో చోటు లభిస్తుందని చాలామంది భావించారు. అయితే ఆయనకు చోటు లేక పోవడంపై పార్టీ వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేశాయి.

క్యాబినెట్ ప్రకటించిన తర్వాత కుటుంబసభ్యులతో బయటకు వచ్చిన సందర్భంలో.. ఆయనతో ప్రజలు సెల్ఫీ తీయించుకున్నారు. మీకు మంత్రి పదవి రాకపోవడం దురదృష్టకరం. మీకు మంత్రి పదవి ఇవ్వకుండా, ఎవరో కొత్తవారికి ఇవ్వడం అన్యాయం అంటూ సానుభూతి ప్రకటిస్తున్నారు. దానితో మూడురోజుల్లో పల్లా సెలబ్రిటీగా మారారు.

అయితే యాదవ వర్గాలను మెప్పిస్తూ, ఉత్తరాది వారికి మరో కానుకగా పల్లా శ్రీనివాసరావును, ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా నియమిస్తూ చంద్రబాబునాయుడు అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇది రాష్ట్రంలో యాదవులను మెప్పించే నిర్ణయమే. నిజానికి పల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాల్సి ఉన్నప్పటికీ.. అప్పటికే కొలుసు పార్థసారథికి



టీడీపీ నుంచి, సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ నుంచి మంత్రి వర్గంలో స్థానం కల్పించారు. దానితో కులసమీకరణలో భాగంగా పల్లాకు నిరాశ ఎదురైంది.

కానీ ఏకంగా కీలకమైన పార్టీ అధ్యక్ష పదవి లభించడం పల్లా సైతం ఊహించనిదే. ప్రస్తుత అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు మంత్రి పదవి లభించడంతో, ఆయన స్థానంలో అదే ఉత్తరాంధ్రకు చెందిన పల్లాకు స్థానం కల్పించారు. దీనితో చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్రపై తన ప్రాధాన్యతను చాటుకున్నట్లయింది. అదే సమయంలో అత్యధిక మెజారిటీ దక్కిన నేతకు మంత్రి పదవి ఇవ్వలేదన్న విమర్శలకు తెరదించినట్లయింది.

ఉత్తరాంధ్ర జగన్ బాధితుల్లో మిగతా.. 2లో

● రెవెన్యూ ప్రక్షాళనకు చర్యలు
● గత ప్రభుత్వం తెచ్చిన ధరణితో లక్షలాది కుటుంబాలు ఛిన్నాభిన్నం
● రెవెన్యూ మంత్రి పొంగులేటి
● సిద్ధమవుతున్న ధరణి నివేదిక
● మంత్రి పొంగులేటితో సమావేశమైన ధరణి కమిటీ



## సామాన్యులకు అందుబాటులో

# ధరణి పోర్టల్

హైదరాబాద్, మహానాడు:
గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత స్వయంగా తాను ఖమ్మం జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు ప్రతి గ్రామంలో రెండు వందల కుటుంబాలకు పైగా భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. మిగతా.. 2లో



## రైతన్నలకు అండగా నిలుస్తా..

● రైతన్నకు సేవ చేసే భాగ్యం కల్పించిన బాబుకి కృతజ్ఞతలు
● వ్యయసాయాభివృద్ధికి పాటుపడతా
● వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి,మహానాడు:
నాపై నమ్మకంతో అత్యంత కీలకమైన వ్యవసాయ శాఖ మంత్రిగా నన్ను నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

చంద్రబాబు నాయుడు నాకు అప్పగించిన బాధ్యతను అంతఃకరణ శుద్ధితో నిర్వహించి ప్రతిక్షణం రైతన్నల సంక్షేమానికి, రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి పాటుపడతా. గత 5 ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖను భ్రష్టుపట్టించింది. మిగతా.. 2లో



## ఏం జరిగిందో

# దేవుడికే తెలియాలి

● మనలో ధైర్యం సన్నగిల్లకూడదు
● నాలో సత్తువ ఇంకా తగ్గలేదు
● పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వై.వి.సుబ్బారెడ్డి బాధ్యతలు
● అందరికీ నేను అందుబాటులో ఉంటా

విజయవాడ, మహానాడు:
వైయస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలనుద్దేశించి తన క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్ మిగతా.. 2లో





2 లో

## ఆరుద్రకు

# బాబు అభయం!

● సీఎంను కలిసిన కాకినాడకు చెందిన బాధిత మహిళ ఆరుద్ర
● తనను కలవడానికి ఆరుద్ర ప్రయత్నించిందని తెలిసి సచివాలయానికి పిలిపించి మాట్లాడిన సిఎం చంద్రబాబు
● ఆరుద్ర కుమార్తె ఆరోగ్య ఖర్చులకు రూ.5 లక్షలు సాయం ప్రకటించిన సీఎం..పెన్షన్‌పై హామీ

## రైతులకు సాయంపై

# రంధ్రాన్వేషణ చేస్తారా!

● రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలి
● ప్రభుత్వ ఆంక్షలు గర్హనీయం
● కాంగ్రెస్ ప్రభుత్వ తీరు సిగ్గుచేటు
● రైతులు ఎవరైనా రైతులే
● ఎన్నికల హామీ ప్రకారం రుణమాఫీ ప్రతి ఒక్కరికి చేయాలి
● రుణమాఫీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ డేటాను ప్రాతిపదికగా తీసుకోవాలన్న నిర్ణయంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మహానాడు:
ఏడు నెలలు దాటినా ఇంకా కట్ ఆఫ్ డేట్ కూడా నిర్ణయించకపోవడం ఈ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యానికి నిదర్శనం. దేశంలో తొలిసారి కేసీఆర్ రైతుబంధు పథకం అమలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడి పెరిగి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024



# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలిసిన కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, మహానాడు: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఇవాళ (శుక్రవారం) భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా గురువారం కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి సతీశ్ చంద్ర దూబేతో కలిసి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలను గౌరవప్రదంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి,కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి, సహాయ మంత్రి సతీశ్ దూబేలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పల్లాకు పార్టీ పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి..)

పల్లా ఒకరు. ఆయనను పార్టీలోకి తీసుకువచ్చేందుకు, అప్పట్లో విజయసాయిరెడ్డి చాలా ప్రయత్నించారు. పదవులు ఆఫర్‌చేశారు. పల్లా తిరస్కరించడంతో ఆయన భవనాన్ని కూల్చివేశారు. పోలీసుల వేధింపులకు గురైన నేతలలో పల్లా ఒకరు.

కాగా రాష్ట్రంలో బీసీలలో అత్యధిక జనాభా ఉన్న యాద వులకు, రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించడం సహజంగా ఆ వర్గాన్ని మెప్పించేదే.

ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన నాటి నుంచి, యాదవులు ఆ పార్టీతో కొనసాగుతున్నారు. తెలంగాణలో సైతం యాదవుల అనుబంధం టీడీపీతోనే అన్నది తెలిసిందే.

# ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తా

● టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



మంగళగిరి,మహానాడు: హెచ్‌ఆర్‌డి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజి శాఖల మంత్రి గా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కల్పించిన చంద్రబాబు గారికి ధన్యవాదాలు. నాడు పల్లె సేవే పరమాత్ముడి సేవ అని భావించి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామాల రూపురేఖలు మార్చాను. ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా అనేక కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాను.

గత అనుభవం నేర్పిన పాఠాలతో ఇప్పుడు మరింత సమర్ధ వంతంగా పనిచేస్తాను. యువగళం పాదయాత్రలో కేజీ నుండి పీజీ వరకూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చాను. స్టాన్‌ఫోర్డ్ లో చదువుకున్న నాకు గ్రామీణ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాన్ని ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరిస్తున్నాను. రాష్ట్రానికి ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తీసుకొచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తాను.

# సామాన్యులకు అందుబాటులో ధరణి పోర్టల్

(మొదటిపేజీ తరువాయి..)

ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి ధరణి పోర్టల్‌ను పునర్ వ్యవస్థీకరించి భూ సంబంధిత వ్యవహారాలను అందుకు సంబంధించిన చట్టాలలో మార్పులు తేవాల్సిన అవసరం ఏర్పడిందని ఈ దిశగా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టామని వెల్లడించారు.

శుక్రవారం నాడు డా.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం లోని తన కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి గారు ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండ రెడ్డి, ఎం.సునిల్ కుమార్, మధుసూదన్‌లతో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ...

గత ప్రభుత్వం ఎంతో హడావిడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థ (ధరణి) ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని, ధరణి పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి అయిదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ చేసిన సిఫారసులపై ఈరోజు జరిగిన సమావేశంలో సుధీర్ఘంగా చర్చించామని, ఈ కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేకంటే ముందు అన్నీ జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతో పాటు 18 రాష్ట్రాలలోని R R యాక్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించింది. భూమి వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్ లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించిందని మంత్రిగారు వెల్లడించారు.

లోపభూయిష్టమైన 2020 R R చట్టాన్ని తద్వారా రూపొందించిన ధరణి పోర్టల్ ను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ధరణి పోర్టల్ లో మార్పులు-చేర్పులు చేపట్టబోతున్నామని మంత్రిగారు వెల్లడించారు.

గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

# రైతు పొలంలో ఫ్లెక్సీలపై తుమ్మల ఆరా



హైదరాబాద్, మహానాడు: కామారెడ్డి జిల్లా, లింగంపేట గ్రామంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఒక రైతు పొలంలో ఫ్లెక్సీలు కట్టడంపై గౌరవ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరాతీశారు.

ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ, సదరు రైతుకు 2010లో దీర్ఘకాలిక రుణం మంజూరు చేశామని, గడువు 9 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత అనేకసార్లు కలిసి రుణాన్ని చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేసామని, బ్యాంకుకు తనాఖా పెట్టిన భూమిని కూడా ఇతరులకు విక్రయిస్తున్నాడని, ఆ సందర్భముగా అలా పెట్టవలసివచ్చిందని వివరించగా, దానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలా ఫ్లెక్సీలు పెట్టడం లాంటి పద్ధతులను తమ ప్రభుత్వం ఉపేక్షించదని తెలియజేసారు.

# ఆరుద్రకు బాబు అభయం!

**అమరావతి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కాకినాడకు చెందిన ఆరుద్ర అనే మహిళ కలిశారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబును తన కుమార్తెతో వచ్చి కలిశారు.

కాకినాడకు చెందిన ఆరుద్ర గత ప్రభుత్వ హయాంలో తాను ఎదుర్కొన్న సమస్యలు, వేధింపులను ముఖ్యమంత్రికి వివరించారు. తన కుమార్తె సాయిలక్ష్మీ చంద్ర కు వెన్నులో కణితి ఏర్పడటంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యిందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

గతంలో బిడ్డ వైద్య ఖర్చుల కోసం తన ఆస్తులు అమ్ముకునే ప్రయత్నంలో తనకు ఎదరైన కష్టాలను ఆమె వివరించారు. అమలాపురంలో తన స్థలం విక్రయంలో ఇప్పటికీ ఇబ్బందులకు గురి చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని సీఎం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుద్ర సమస్యలపై స్పందించిన సీఎం.... కుమార్తె సాయిలక్ష్మీ చంద్రకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రతి నెలా రూ.10 వేల పెన్షన్ అందించనున్నట్లు తెలిపారు. కోర్టులో ఉన్న స్థల వివాదంపై ప్రభుత్వ పరంగా ఎంత వరకు సాయం చేయవచ్చు అనేది కూడా పరిశీలించి అండగా ఉంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

చంద్రబాబు గెలుపుతో తన కష్టాలు తీరిపోయినట్లు అనిపించిందని....ఇప్పుడు ఎంతో ధైర్యంగా ఉందని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. సిఎం ఇచ్చిన భరోసాతో ఆరుద్ర సంతోషం వ్యక్తం చేశారు. గతంలో తన సమస్యను అప్పటి సిఎం దృష్టికి తీసుకెళ్లేందుకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద ప్రయత్నించగా స్పందించలేదని ఆమె అన్నారు.

పైగా ఎదురు కేసులు పెట్టి, వివాదాలు సృష్టించి తనను మానసిక హింసకు గురిచేశారని...పిచ్చిదాన్ని అనే ముద్ర వేశారని ఆరుద్ర కన్నీటిపర్యంతం అయ్యారు. ఆరుద్ర కష్టాలు విన్న ముఖ్యమంత్రి...ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని ఆమెకు హామీ ఇచ్చారు.

# రైతన్నలకు అండగా నిలుస్తా..

(మొదటిపేజీ తరువాయి..)

రానున్న 5 ఏళ్లలో రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి పాటుపడతాం. విత్తనం నుంచి విక్రయం వరకు రైతన్నలకు అన్ని విధాల అండగా నిలబడతాం.

రైతుల ఆదాయం పెంపొందించేందుకు కృషి చేస్తా. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన సబ్సిడీ యంత్రాలు, యంత్ర పరికరాలు, మైక్రో ఇరిగేషన్ వంటి అన్ని పథకాలు పునరుద్ధరిస్తాం.

రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు నావంతు కృషి చేస్తా.

# కంగ్రాట్స్.. పవన్ కళ్యాణ్

● సీఎం చంద్రబాబు ట్వీట్



మంగళగిరి,మహానాడు: డిప్యూటీ సీఎంగా నియమితులైన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు సీఎం చంద్రబాబు నాయుడు కంగ్రాట్స్ చెప్పారు. 'మంత్రివర్గంలో వివిధ శాఖలు పొందిన నా సహచరులందరికీ అభినందనలు. అందరం రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తామని, ప్రజా పాలనకు నాంది పలుకుతామని ప్రతిజ్ఞ చేశాం. మంత్రులుగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి మీరు కృషి చేస్తారనే

నమ్మకం నాకుంది. నూతన ప్రయాణంలో మరోసారి అందరికీ శుభాకాంక్షలు' అని సీఎం ట్వీట్ చేశారు.

# రైతులకు సాయంపై రంధ్రాన్వేషణ చేస్తారా!

(మొదటిపేజీ తరువాయి..)

అదీ ఏడాదికి ఈ పథకం కింద మూడు విడతలలో ఇచ్చేది మొత్తంగా రూ.6 వేలు మాత్రమే .. దాని అమలుకు కూడా కేంద్రం సవాలక్ష ఆంక్షలు విధించింది.

తెలంగాణలో 70 లక్షల మందికి పైగా రైతులు ఉండగా కేంద్ర ప్రభుత్వ కిసాన్ సమ్మాన్ నిధి గరిష్టంగా 36.1 లక్షల మంది రైతులకే అమలు చేశారు. కేంద్రం విధించిన అనేక నిబంధనల మూలంగా ప్రస్తుతం రాష్ట్రంలో కిసాన్ సమ్మాన్ నిధి రైతుల సంఖ్య 29 లక్షల 78 వేల 394 మంది కాగా ఇందులో 29 లక్షల 50 వేల 888 మంది ఖాతాలలో ఈ విడతలో నగదు జమయింది.

ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు 70 లక్షల మంది రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.5 వేలు, ఏడాదికి ఎకరాకు రూ.10 వేలు రైతుబంధు పథకాన్ని వర్తింపచేశారు.

దేశ, ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 11 విడతల్లో రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.72,910 కోట్లు జమచేశారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనను ప్రాతిపదికగా తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 70 లక్షల పైచిలుకు రైతాంగంలో సగానికి సగం మంది రైతులకు పథకాలను ఎగ్గొట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నది.

మరి ఎన్నికల ప్రచార సమయంలోనే రైతుబంధు, రైతుభరోసా పథకాల అమలుకు నిబంధనలు వర్తింప చేస్తామని ఎందుకు చెప్పలేదు ? ఎన్నికల సమయంలో రైతుబంధు తరహాలోనే రూ.10 వేలకు అదనంగా రూ.5 వేలు పెంచి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున రైతుభరోసా ఇస్తామని రైతులను హామీ ఇచ్చారు.

అధికారం చేతికి వచ్చాక రైతుబంధు మాదిరిగానే గత యాసంగిలో ఎకరాకు రూ.5 వేలు అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడునెలలు దాటినా ఇంకా విధి విధానాలు, మార్గదర్శకాలు అంటూ మరోసారి ఎకరాకు రూ.5 వేలు ఇస్తామని, తర్వాత రూ.2500 ఇస్తామని వాయిదాల పద్దతి మొదలు పెట్టారు. అది కూడా ఏ ప్రాతిపదికన ఇస్తారు ? ఎవరికి ఇస్తారు ? అన్న క్లారిటీ లేదు.

అదికారంలోకి రాగానే డిసెంబరు 9వ తేదీన రూ.15 వేలు రైతుభరోసా అన్నారు .. రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు. అబద్దపు హామీలతో అధికారం చేజిక్కించుకున్నాక గత ఏడు నెలలుగా హామీల ఎగవేతకు రంధ్రాన్వేషణ చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ, రైతుభరోసా అందరికీ అమలు చేయాలి

ఏ మాత్రం వెనక్కి తగ్గినా రైతులను కలుపుకుని ఉద్యమిస్తాం. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. సాగునీళ్లు, కరంటు, పంటల కొనుగోళ్లలో రైతాంగాన్ని రాచిరంపాన పెడుతుంది.అబద్దపు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

రేవంత్ పనితీరు పేరు గొప్ప .. ఊరు దిబ్బ అన్నట్లు .. మీడియా ప్రచారం, వార్తల లీకేజీలు, ప్యాకేజీలు అన్నట్లు పాలన సాగుతుంది. ఆడలేక మద్దెలోడు తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలలో కోతలు విధిస్తుంది.



# వెల్కమ్ చీఫ్


- మంచు మనోజ్ ట్వీట్

జనసేనాని పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంతో పాటు పలుశాఖలకు మంత్రి కావడంపై టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ హర్షం వ్యక్తం చేశారు. 'మెరుగైన సమాజం కోసం మీ నిర్విరామ అంకితభావం, నిబద్ధతకు ఎట్టకేలకు ఫలితం దక్కింది.మీరు మా అందరికీ స్ఫూర్తినిస్తూనే ఉండండి.ప్రొడక్టివ్, ఎఫెక్టివ్ పాలన రావాలని కోరుకుంటున్నా. వెల్కమ్ చీఫ్' అని ట్వీట్ చేశారు.

## మంచి చేసి ఓడిపోయాం..
# తలెత్తుకు తిరుగుదాం

- మాజీ మంత్రి రోజా

విజయవాడ,మహానాడు: ఎన్నికల్లో వైసీపీ పరాభవంపై మాజీ మంత్రి రోజా తొలిసారి స్పందించారు. 'చెడు చేసి ఓడిపోతే సిగ్గుపడాలి కానీ మంచి చేసి ఓడిపోయాం.గౌరవంగా తలెత్తుకు తిరుగుదాం. ప్రజల గొంతుకై ప్రతిధ్వనిద్దాం' అనిXలో పోస్ట్ చేశారు. కాగా నగరిలో రోజాపై టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాశ్ రెడ్డి 45వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.








# హోంమంత్రి.. త..త..త..త!

- సబిత, సుచరిత, వనిత, అనితకు పట్టం

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఒక్కోసారి కాకతాళీయంగా జరిగే కొన్ని సంఘటనలు ఆసక్తికరంగా ఉంటాయి. అవి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్-విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ విచిత్రమైన అనుభవమిది.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక అద్భుత ప్రయోగం చేశారు. దివంగత ఇంద్రారెడ్డి భార్య సబితకు హోంమంత్రి ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎందుకంటే ఒక మహిళకు హోంమంత్రి పదవి ఇచ్చిన తొలి అనుభవం అది. అంతపెద్ద కీలక పదవిని సబిత నిర్వహించ గలరా? అన్న సందేహం తెరపైకి వచ్చింది.

సీన్ కట్ చేస్తే... విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం జగన్.. మహిళా ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు హోంమంత్రి పదవి ఇచ్చి, ఏపీలో తొలి మహిళా ఏపీ హోంమంత్రి అన్న కీర్తి ఆమెకు అందించారు. తర్వాత ఎమ్మెల్యే వనితకు హోంమంత్రి పదవి ఇచ్చారు.

ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు కూడా, అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనితకు హోంమంత్రి పదవి ఇచ్చి, గౌరవించారు. విచిత్ర మేమిటంటే.. సబిత మినహా మిగిలిన సుచరిత, వనిత, అనిత ముగ్గురూ దళితులే.

అయితే ఇప్పటి రాజకీయ ముఖచిత్రం.. ప్రాంతీయ పార్టీల అధిపత్యంలో, హోంమంత్రులకు అసలు అధికారాలు ఉంటాయా? లేదా? అన్నది మరో చర్చ. పేరుకు ఎవరు హోంమంత్రులున్నా.. కీలకమైన లా అండ్ ఆర్డర్ ముఖ్య మంత్రుల దగ్గరే ఉంటుంది. దానితో హోంమంత్రులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. చివరికి తమ నియోజకవర్గాల్లో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను కూడా బదిలీ చేయించుకోలేరన్న ప్రచారం రాజకీయవర్గాల్లో ఉంది. కేవలం బుగ్గకారు, ప్రొటోకాల్ మినహా హోంమంత్రులకు అంత విలువ ఉండదన్నది ఒక భావన.

పైగా మహిళ ఆ స్థానంలో ఉండటంతో, రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు చేయరన్న వ్యూహం కూడా.. మహిళలకు హోంమంత్రి పదవులు ఇవ్వడానికి మరో మతలబన్నది రాజకీయ పరిశీలకుల ఉవాచ.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

## ధర్మవరంలో చేనేత రంగం

# అభివృద్ధికి సహకరించండి...

- కేంద్ర టెక్స్టైల్ శాఖ మంత్రిని కోరిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

మంగళగిరి,మహానాడు

చేనేతల కేంద్రమైన ధర్మవరాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్రం నుండి సహాయ సహకారాలు అందించాలని కేంద్ర టెక్స్టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న సత్య కుమార్ యాదవ్‌కు కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో చేనేతలు తనపై ఎంతో నమ్మకంతో అండగా నిలిచి గెలిపించారని వారి రుణం తీర్చుకోవడానికి ధర్మవరంలో మార్కెటింగ్ వ్యవస్థ, టెక్స్టైల్స్ పార్క్, మెగా క్లస్టర్ మంజూరు చేసి పట్టు పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ ధర్మవరంలో



చేనేత రంగం అభివృద్ధి కోసం తాను తప్పకుండా సహకరిస్తానని, కేంద్ర ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. అలాగే సత్య కుమార్ కోరిక మేరకు అతి తొందరలోనే ధర్మవరం కి వస్తానని హామీ ఇచ్చారు.

# పోలీసులు పద్ధతి మార్చుకోవాలి

- లేదంటే మేమే మారుస్తాం
- చంద్రయ్య వంటి హత్య కేసులను రీఓపెన్
- హోంమంత్రి అనిత

మంగళగిరి,మహానాడు:

పోలీస్ వ్యవస్థలో మార్పు తీసుకొస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.'కొంతమంది పోలీసులు పద్ధతి మార్చుకోవాలి.లేదంటే మేమే మారుస్తాం.మాచర్లలో చంద్రయ్య వంటి హత్య కేసులను రీఓపెన్ చేస్తాం. TDP కార్యకర్తలు, నేతలు గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్రమ కేసులపై సమీక్ష జరుగుతుంది. నాకు కీలకమైన హోంశాఖ అప్పగించిన చంద్రబాబు, పవన్, లోకేశ్కు కృతజ్ఞతలు' అని ఆమె వెల్లడించారు.



# విపక్షం ఉండాలి

- జగన్ సభకు రావాలి
- ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి:

తప్పనిసరిగా ప్రతిపక్షం ఉండాలని కోరుకుంటున్నట్టు ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎందుకంటే వైఎస్సార్సీపీ అధినేత జగన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి ప్రజల తరఫున మాట్లాడాలని తాను కోరుకుంటున్నట్టు వ్యాఖ్యానించారు. శాసనసభకు జగన్ రావాలని కోరుకుంటు న్నానని, గతంలో చంద్రబాబు మొదటిసారి సీఎం అయిన ప్పుడు నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత పీజేఆర్‌ను ఇంటికి వెళ్లి కలిశారని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండాలని ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు.



## దటీజ్ చంద్రబాబు..

# మాట నిలబెట్టుకునే నైజం

- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ఎన్టీఆర్ జిల్లా (నందిగామ పట్టణం):

ఎక్కడా మాటతప్పమని చెప్పలేదు.. ఎక్కడా మడం తిప్పమని అనలేదు. చెట్టు పేరు చెప్పుకొని కాయలూసులు ఎత్తలేదు. అధికారంలోకి వస్తే ఏం చేస్తానో అదే చెప్పారు. ఎక్కడ డొంక తిరుగుడు లేదు. చేసేదే చెబుతానన్నారు. అంతా సూటిగానే చెప్పారు. నాడు చెప్పిందే.. నేడు తన సంతకంతో అక్షరాల నిజం చేసి దటీజ్ నారా చంద్రబాబు నాయుడు అనిపించుకున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు.

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించార న్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన తొలి ఐదు హామీలపై పంచభూతల సాక్షిగా టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు సంతకాలు చేశారన్నారు. దీంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే ఆయన సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని స్పష్టం చేసారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై సీఎం చంద్రబాబు గారు తొలి సంతకం చేశారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేశారు. ఇక ఫించన్ రూ.4 వేలకు పెంచుతూ అందుకు



సంబంధించిన దస్త్రంపై మూడవ సంతకం పెట్టారు. టీడీపీ హయాంలో ప్రవేశపెట్టి.. గత జగన్ పాలనలో ధ్వంసమైన 'అన్నా క్యాంటీన్ల వ్యవస్థ'కు సంబంధించిన పునరుద్ధరణ ఫైల్‌పై నాలుగో సంతకం చేశారు. అదే విధంగా యువత నైపుణ్య గణనపై కూటమి నేతలు ఇచ్చిన హామీ నేపథ్యంలో ఆ ఫైల్‌పై సైతం సీఎం చంద్రబాబు ఐదవ సంతకం చేశారని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.

# నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమిటి?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్, మహానాడు:

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా నిరుద్యోగులను అనేక విధాలుగా రెచ్చగొట్టిన నాయకులు, అధికారంలోకి రాగానే వారి పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో ఈ దృశ్యాలే సజీవ సాక్ష్యం.

గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 మరియు గ్రూప్ 2 & 3 పోస్టులు పెంచాలని అభ్యర్థులు.. నాయకుల కాళ్ళు పట్టుకొని వేడుకునే పరిస్థితి రావడం దురదృష్టకరం. ప్రతిపక్షంలో ఉన్న పుడు గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 ఎల్జిబిలిటీ పరిగణిం చాలని విజ్ఞప్తి చేసిన వారికి, అధికారంలోకి రాగానే ఆ విజ్ఞప్తులు ఎందుకు కనిపించడం లేదు?

25వేల టీచర్ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల హామీగా చెప్పిన కాంగ్రెస్ పార్టీ, 11 వేల పోస్టులు మాత్రమే వేసి చేతులుదులుపుకున్నది.అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఆరు నెలలు గడుస్తున్నా ఆ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి ప్రణాళిక రూపించకపోవడం విద్యార్థులను మోసం చేయడమే.


బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన పోస్టులకు నియామక పత్రాలు అందించి, 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని డబ్బా కొట్టుకోవడం తప్ప, యువత, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమిటి?

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రూప్స్ విద్యార్థుల వినతులను పరిగణలోకి తీసుకోవాలి. డీఎస్సీ నోటిఫికేషన్ పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు, ఎన్నికల మేనిఫెస్టోలో




యువతకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# తెలంగాణకు విద్యా శాఖ మంత్రి కావలెను



- బడిబాట మొదలైంది కానీ బడికి మంత్రి లేడు
- మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ.. విద్యకు మంత్రి వద్దా?
- బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ

హైదరాబాద్, మహానాడు:

విద్య సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పుస్తకాల పైన పాత ముఖ్యమంత్రి, పాత విద్యాశాఖ మంత్రి పేర్లు ఉన్నాయి. విద్యార్థులు చూసి చెప్పే వరకు ఇవి బయటకు రాని పరిస్థితి.. పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందనడనికి ఇంతకంటే ఎం నిదర్శనం కావాలి.

విద్యా శాఖ ఒక దిక్కు దివాన లేని శాఖ లెక్క మారింది. విద్యాశాఖకు మంత్రి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు..కొత్త ప్రభుత్వం రాగానే మద్యం శాఖకు మంత్రిని పెట్టారు.. విద్యాశాఖకు మాత్రం మంత్రి పెట్టలేదు..సీఎం రేవంత్ రెడ్డికి విద్యాశాఖకు ఎమ్ చేసాడు అంటే గాడిద గుడ్డు చేసాడు. ప్రతి జిల్లాకు DEO ఉండాలి..

కానీ 26 జిల్లాలకు DEOలు లేరు.

62 డెప్యూటీ EO పోస్టులకు ఒక్కరు కూడా డ్యూటీ లో లేరు.617 మండలకు MEO ఉండాలి కానీ.. కేవలం 17 మంది మాత్రమే MEOలు ఉన్నారు.598 మండలకు MEO లేరు. పాఠశాలలలో మరుగుదొడ్లు కడిగేందుకు స్కావెంజర్లు లేక దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో 22 వేల టీచర్ల పోస్టులు ఖాళీలు ఉంటే నోటిఫికేషన్ ఇచ్చింది 11వేలు మాత్రమే..

కాంగ్రెస్‌లో గొడవలు ఉంటే పేదలు ఎందుకు ఇబ్బంది పడాలి. కాంగ్రెస్‌లో విద్యాశాఖ నిర్వహించే అర్హులు ఎవరు లేరా..? విద్యాశాఖను పర్యవేక్షణ చేసే టైం సీఎం రేవంత్ రెడ్డి వద్ద లేకపోతే ఎందుకు దగ్గర పెట్టుకున్నారు..వెంటనే విద్యాశాఖ మంత్రిని పెట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్వ శిక్ష అభియాన్ నిధులు పూర్తిగా వాడండి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

## వీరంతా ఐఎఎస్‌లేనా

# లేక అయ్యా ఎస్ లా?

### అయ్యా - ఎస్, కథా కమిషు

దేశంలో అత్యున్నత పరిపాలనా ప్రమాణాలు ఎవరికి ఉంటాయి? ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిపాలనకు సంబంధించిన కీలక అంశాలపై శిక్షణ పొందిన అఖిల భారత సర్వీసు (ఐఏఎస్) అధికారులకు ఉంటాయి. వీరినే కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ ఇతర విభాగాల కింద పరిగణించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తుంది. ఈ అధికారులు అక్కడి ప్రభుత్వ అవసరాల నిమిత్తం తమకు కేటాయించిన శాఖలలో ప్రజలకు జవాబుదారీగా బాధ్యతతో పనిచేయాలి. ఇందుకోసమే వేలకు వేల రూపాయలను వీరికి



జీతభత్యాలుగా ప్రభుత్వం చెల్లిస్తుంది. పదవీ విరమణ వరకు వీరి బాధ్యత ప్రజల అవసరాల మేరకు పనిచేయడమే. కానీ గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆలిండియా సర్వీసు అధికారులు ఇలాగే విధులు నిర్వర్తించారా? దేశం మొత్తం సిగ్గుపడేలా పనిచేసారా? ప్రజలంతా వీరి పనితీరు చూసి నివ్వెరపోవడానికి ప్రధాన కారణం ...ప్రజలకు జవాబుదారీగా కాకుండా క్రూరమైన పాలకుడు జగన్‌కు దాసోహమై పనిచేయడమే వీరికి చెడ్డ పేరు తెచ్చింది. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో మంచి రికార్డు ఉన్న అధికారులు సైతం జగన్‌కు దాసోహమయ్యారు. తప్పును విడనాడి మంచిని చేయాలని జగన్‌కు దిశానిర్దేశం చేయాల్సిన అధికారులు వక్రమార్గంలో ఆలోచించారు. దీంతో ప్రజలు అవురా అని నోటి మీద వేలేసుకుంటున్నారు. మరి ఇటువంటి వారిని భారీ ప్రజాదరణతో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చూస్తూ ఉరుకుంటుందా? అందుకే వారి పట్ల చంద్రబాబు వైఖరి కఠినంగానే కన్పిస్తోంది.

రాష్ట్రంలో ఐ.ఎ.ఎస్ , ఐ.ఆర్.ఎస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకల్లా తయారయ్యింది. ఒకప్పుడు పరిపాలన పూర్తిగా ఐ.ఎ.ఎస్ ల చేతుల్లోనే వుండేది. అంతెందుకు ఎన్.టి.ఆర్ కూడా కలెక్టర్లయిన జయప్రకాష్ నారాయణ, ఎ.వి.ఎస్ రెడ్డి లాంటి వారికి ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ నేడు ఐ.ఎ.ఎస్ లు నాయకుల ముందు అయ్యా - ఎస్ అంటూ దిగజారిపోయి వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడి అవినీతికి సహకరిస్తూ పార్టీ , ప్రభుత్వం మధ్య ఉండే గీతను చెరిపేసి మేళ్లు చేస్తున్నారు. ఒకప్పుడు బాబు హయాంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చు కున్న ఐ.ఎ.ఎస్ లు తరువాత కాలంలో క్విడ్ ప్రోకో కు సహకరించి అవినీతి కేసుల్లో ఇరుక్కుని జైళ్ల పాలయ్యారు. అయినా బుద్ధి రాలేదు సరికదా కుక్కతోక వంకర అన్నట్లు మరలా మరలా అవినీతికి పాల్పడుతున్నారు. ఇప్పుడు ఎ.పి లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వీరిని ప్రక్షాళన చేయకుంటే అభివృద్ధి ముందుకు సాగే పరిస్థితి లేదు. ముందుగా హైద్రాబాద్ నుండి మకాంలు పూర్తిగా అమరావతికి మార్చాలి. నివాసాలు గుంటూరు లోనో, విజయవాడ లోనో ఉండవచ్చు. ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న అధికారులు సైతం అవినీతికి మారుపేరుగా మారిపోయారు. వారు వందల ఎకరాల భూములు , ఇతర ఆస్తులు సంపాదిస్తున్నారు. ఒకప్పుడు అవినీతి చాలా చిన్న మొత్తంలో ఉండేది. లంచం తీసుకోవ డానికి జంకేవారు. నేడు అది ఇచ్చుకోనిదే ఏ కార్యాలయంలో నైనా కాగితం ముందుకు నడవదు. లంచం అనేది దక్షిణ కిందకు వచ్చింది. వారికి అది హక్కుగా మారింది. అసలు కాగితం మీద పెన్ను పెట్ట కుండానే ఎంతిస్తావ్ అని అడిగే పరిస్థితికి వ్యవస్థలను దిగజార్చారు.

- వి.ఎల్. ప్రసాద్



# జర్మనీలో ఘనంగా మినీ మహానాడు వేడుకలు

**జర్మనీ:** జర్మనీలోని ఫ్రాంక్‌ఫార్ట్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ఆధ్వర్యంలో మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. ఏపీలో విధ్వంసకర పాలన, నియంత పాలన వధించి నందుకు గాను జర్మనీలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మతో పాటు జర్మనీ ఎన్ఆర్ఐ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కావలి గ్రీష్మ మాట్లాడుతూ.... "ఈ ఎన్నికల్లో ఎన్ఆర్ఐలు టీడీపీ విజయ కోసం ఎనలేని కృషి చేశారు. ఎన్నికల ముందు కొన్ని నెలల పాటు మీ ఉద్యోగాలు, కుటుంబాల్ని వదలి రాష్ట్రంలోనే ఉంటూ పార్టీ కోసం పనిచేసిన తీరు అభినంధనీయం. నియంత జగన్ రెడ్డి సామ్రాజ్యాన్ని నేలమట్టం చేసిన యోధుడు మన అధినేత నారా చంద్రబాబు నాయుడు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో కేవలం 23 స్థానాలకు పరిమితమైన దశ నుంచి జగన్ వంటి అరాచక, విధ్వంసకర పాలకుడికి ఎదురొడ్డి పోరాడి అధ్భుత, అసాధరణ విజయాన్ని మనకు అందించిన ఘనత చంద్రబాబు దే.

అభివృద్ధి, సంక్షేమం రెండూ జరగాలని ఆయన కోరుకుంటారు. కేవలం రాష్ట్రాభివృద్ధి చెందితే సరిపోదని దేశం కూడా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షిస్తారు. 2014లో ఒకవైపు విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తూ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించిన దార్శనికుడు చంద్రబాబు.

2019 లో తెలుగు ప్రజలు చేసిన ఒక్క తప్పిదానికి ఐదేళ్లు అంధకారంలో ఏపీ మగ్గిపోయింది. నవరత్నాల పేరుతో ల్యాండ్, శాండ్, వైన్, మైన్‌లో ఇష్టారాజ్యంగా జగన్ రెడ్డి ప్రభుత్వం దోచుకుంది. రాష్ట్రానికి కొత్తగా ఒక్క పరిశ్రమను తీసుకురాకపోగా ఉన్న పరిశ్రమలను తరిమేశారు. సంక్షేమ పథకాలను అందించకుండానే అందినట్లు చూపించి అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టేసిన ఘనత జగన్ రెడ్డిది.

జగన్ రెడ్డి అరాచక ప్రభుత్వాన్ని భరించలేని ప్రజలు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చావు దెబ్బ కొట్టారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. 11 సీట్ల నుంచి తిరిగి పుంజుకోవడానికి జగన్ రెడ్డి ఏమి చంద్రబాబు కాదు. 2019లో 175కి కేవలం 23 సీట్లు నెగ్గాం. ఇక టీడీపీ పని అయిపోయిందని ఎవరెవరో విశ్లేషణలు ఇచ్చారు. కానీ గాయపడిన సింహం నుంచి వచ్చే గర్జనలా 164 గెలిచి అఖండ విజయాన్ని సాధించాం.

ఈ విజయంలో టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కూడా కీలకపాత్ర పోషించడం హర్షణీయం. ఈ విజయం అందరిది. జగన్ ప్రభుత్వంలా హింసా, విద్వేష రాజకీయాలు, పగలు, ప్రతీకారాలు తీర్చుకునే నీఛ ప్రభుత్వం మనది కాదు. అటువంటి వాటిని చంద్రబాబు ప్రోత్సహించరు కూడా. దేశాభివృద్ధి, యువత భవిష్యత్తు, ప్రజా సంక్షేమమే ఆయనకు ముఖ్యం. రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న పోరాటంలో మనం కూడా పాత్రను పోషించుదాం" అని గ్రీష్మ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్ఆర్ఐ కోర్ కమిటీ సభ్యులు కుర్ర పవన్, బత్తల శివ, కొర్రపాటి సుమంత్, దాసరి వంశీ, మద్దిపట్ల తిట్టు, కోనేరు నరేష్, కుడితిపూడి శ్రీకాంత్, కంద్ర వెంకట్, మిక్కిలినేని అనిల్ తదిరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు కళ్ళు మూసుకున్నానని అంగీకరించిన జగన్మోహన్ రెడ్డి

- కళ్ళు మూసుకుని ఉండబట్టే ఎన్నికల్లో అధికార పార్టీ దారుణంగా ఓటమిపాలయ్యింది
- ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణం రాజు

**అమరావతి, మహానాడు:** అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు కళ్ళు మూసుకున్నానని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగీకరించారని ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు అన్నారు. కళ్ళు మూసు కొని ఉన్నారు కాబట్టే ఎన్నికల్లో అధికార పార్టీ దారుణంగా ఓటమిపాలయ్యిందన్నారు. తిరుపతిలో జి 7 రెస్టారెంట్ ను ముఖ్యఅతిథిగా హాజరై రఘురామకృష్ణం రాజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా హెూటల్లో ఆర్ ఆర్ ఆర్ పేరిట ఇడ్లీని ఏర్పాటు చేశారని, అది రాజమౌళి చిత్రం పేరు కాదని తన పేరేనని ఆయన చమత్కరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లపాటు కళ్ళు మూసుకుంటే, ఐదేళ్లపాటు కంటి రెప్ప కూడా వాల్చని నాయకుడు చంద్రబాబు నాయుడన్నారు. ఐదేళ్లపాటు అను క్షణం అప్రమత్తంగా ఉండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఈ ఐదేళ్లపాటు కాదు, మరో పదేళ్లపాటు కళ్ళు మూసుకొని ఉండాల్సిందేనని, ఆ తర్వాత ఆయన గురించి ప్రజలెవరు పట్టించుకోరన్నారు.

రాజకీయాలలో ఉన్నవారు ఎవరైనా ప్రజల మధ్యకి వెళ్లాలని కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేయాల్సిన పని, పదవి పోయిన తర్వాత చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఆయనకు జ్ఞానోదయం కలిగినందుకు సంతోషిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లపాటు జగన్మోహన్ రెడ్డి పరదాల చాటున తిరిగారని, ప్రస్తుతం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పరదాలను తొలగించాలని ఆదేశించడాన్ని ఎలా చూస్తారన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నపై రఘురామకృష్ణంరాజు స్పందిస్తూ పరదాల చాటున తిరుగుతూ చెట్లు నరుక్కుంటూ వెళ్లడమనేది ఆయన అభద్రతా భావానికి నిదర్శనం పేర్కొన్నారు .

చంద్రబాబు నాయుడు తాను ప్రజల మధ్యనే ఉంటానని వరదాలను తొలగించాలని ఆదేశించారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలు అంటే భయపడ్డారని, చంద్రబాబు నాయుడు మాత్రం ప్రజలతో మమేకమవుతూ తొలిరోజే తన కార్యాచరణను స్పష్టంగా తెలియజేశారన్నారు. వైకాపా కున్న సంఖ్య బలం ఆధారంగా ఏ విధంగా పోరాటం చేస్తారన్న ప్రశ్నపై రఘురామ కృష్ణంరాజు స్పందిస్తూ పోరాటానికి సంఖ్యా బలానికి సంబంధం లేదన్నారు. అది నేను ఒప్పుకోనని 10 మంది ఉంటే పోరాడ లేరని, 50 మంది ఉంటే మాత్రమే పోరాడుతారనేది కరెక్ట్ కాదన్నారు. పోరాటానికి ఒక్కరు కూడా చాలని పేర్కొన్నారు.

గత ఐదేళ్లపాటు మీడియా ముందు రాని జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి తొలి రోజు వివిధ ఫైళ్ళపై సంతకం పెట్టగానే మీడియా ముందుకు రావడానికి ఎలా చూస్తారన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు క్షవరం అయినంక వివరం తెలిసిందన్నట్లుగా ఉందని రఘురామ కృష్ణంరాజు సెటైర్ వేశారు. కచ్చితంగా చంద్రబాబు నాయుడు పరిపాలన బాగా ఉంటుందని నాతోపాటు ప్రజలంతా విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు చాలా ఉన్నాయని అవి అమలు కావాలంటే చంద్రబాబు నాయుడు ఒక్కరే కష్టపడితే సరిపోదని, అందరూ ఈ పార్టీ నాది అని సొంతం చేసుకుని కష్టపడాలన్నారు.

అందరూ కష్టపడితే ప్రజలకు ఇచ్చిన హామీలను సునాయాసంగా అమలు చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైనికుల మాదిరిగా పనిచేయడంతో పాటు ప్రజలతో కలిసి మెలిసి ఉండాలని రఘురామకృష్ణంరాజు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు చేయవద్దని, ప్రజలతో కలిసి మెలిసి ఉంటూ సంయమనంతో వాళ్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగాలన్నారు. ఒకవేళ ఒకటి రెండు హామీల అమలులో ఏమైనా ఆలస్యం జరిగితే దాని గురించి ప్రజలకు సవివరంగా వివరించాలన్నారు.

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నెరవేరుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమి నెరవేర్చలేని హామీలు కాదని పేర్కొన్న రఘురామ కృష్ణంరాజు, ప్రాధాన్యత ప్రకారం ఒక్కొక్కటిగా అమలు చేస్తారన్నారు. అన్నీ ఒకేసారి కాకపోయినా మూడు నెలలు, ఆరు నెలల వ్యవధిలో హామీలన్నీ నెరవేర్చే అవకాశం ఉందని తెలిపారు. లోటు బడ్జెట్ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యమేనా? అన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం చేశారని, చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అసలు నిధుల దుర్వినియోగమన్నదే జరగదన్నారు.

గతంలోనూ గ్రోత్ రేటు ఉందని కానీ ఆ నిధులను మింగేశారన్నారు. నిధుల దుర్వినియోగం లేకపోతే చంద్రబాబు నాయుడు అమలు చేస్తానని చెప్పిన సంక్షేమ పథకాలను సునాయసంగా అమలు చేయవచ్చునన్నారు. సంక్షేమ పథకాలు కొన్ని ఈరోజు నుంచే అమలు కాగా, మరి కొన్ని మూడు



నాలుగు నెలల తరువాత అమలు చేసి తీరుతారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమన్న ఆయన, గతంలో ఏ రాష్ట్రానికి దక్కని అప్పులు ఈ రాష్ట్రానికి దక్కాయని, ఇంకా కొంతకాలం కేంద్రం అలాగే సహకరిస్తే మన కాళ్ళ మీద మనం నిలబడతామన్నారు.

పోలవరంతో పాటు రాజధానిని పూర్తి చేసుకోవడమే కాకుండా, పెట్టుబడులను ఆకర్షించవచ్చునని తెలిపారు. అలాగే స్పెషల్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్మెంట్ ప్యాకేజీ కూడా తీసుకు రావడం జరుగుతుందన్నారు. పవన్ కళ్యాణ్ సమర్థుడైన నాయకులని, బాగా పరిపాలన చేయాలనే తపన ఉన్న వ్యక్తి అని పేర్కొన్న రఘురామకృష్ణం రాజు, ప్రజలకు నేనేదైనా మంచి చేయాలని కలకాలం జనాల మనసుల్లో గుర్తుండి పోవాలనే మంచి సంకల్పం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు.

అన్ని సబ్జెక్టులు అందరికీ తెలియాల్సిన అవసరం లేదని, మంచి మనసుంది మంచి సంకల్పంతో ఉంటే చాలని అది పవన్ కళ్యాణ్ కు మెండుగా ఉందని తెలిపారు. జీతం తీసుకుంటేనే బాధ్యత తెలుస్తుందని, అందుకే పవన్ కళ్యాణ్ ప్రజలు కట్టే పన్నుల ద్వారా ఇచ్చే జీతాన్ని తీసుకోవాలని నిర్ణయించారన్నారు. ఒక్క రూపాయి జీతం తీసుకున్న వ్యక్తి ప్రజల రూపాయలను దోచుకున్నారని, ఎప్పుడూ ఒక్క రూపాయి జీతం తీసుకునే వారిని నమ్మవద్దన్నారు.

పవన్ కళ్యాణ్ తీసుకుని లక్షన్నర రూపాయల జీతం ఆయనకు పెద్ద అమౌంట్ కాదని, ఐదారు మంది నిర్మాతలు ఆయనతో 100 కోట్ల రూపాయలు వెచ్చించి సినిమాలు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్న వదులుకొని ప్రజా జీవితంలోకి వచ్చారన్నారు. ఎమ్మెల్సీలతో జగన్మోహన్ రెడ్డి ఎందుకు సమావేశం అయ్యారో ఆయనకే తెలియాలి అన్నారు. గతంలో ఎమ్మెల్సీ వ్యవస్థనే వద్దని జగన్మోహన్ రెడ్డి భావించారని గుర్తు చేశారు. గతంలో మేము వద్దనుకున్న ఎమ్మెల్సీ వ్యవస్థను రద్దు చేయమని ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కోరితే పరిశీలిస్తారేమో చూడాలన్నారు.

అంతేకానీ జగన్ మోహన్ రెడ్డి మాదిరిగా ఉక్రోషంతో ఎమ్మెల్సీ వ్యవస్థను రద్దు చేయాలనుకునే వ్యక్తి మా అధినాయకుడు చంద్రబాబు నాయుడు కాదన్నారు. ఎన్డీఏ కు రాజ్యసభలో భేషరతుగా మద్దతు ఇస్తామని విజయసాయిరెడ్డి పేర్కొన్నారని రఘురామకృష్ణం రాజు గుర్తు చేశారు. బిజెపి అడగకపోయినా వారే ముందుకొచ్చి మద్దతు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, హరిణి శ్రీనివాస్, ఎం ఎం రత్నం, తిరుపతి జనసేన నాయకులు హరి ప్రసాద్, టిడిపి నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఆశలు లేవు ఆశయం మాత్రం ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ బాధ్యత అప్పగించిన స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని రఘురామకృష్ణం రాజు తెలిపారు. తానేంతో ఓపెన్ మైండ్ తో ఉన్నానని, ఏ బాధ్యత లేకుండా లేనని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉండి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని, అదనంగా ఏ బాధ్యత అప్పగించిన నెరవేర్చడానికి సిద్ధమేనని చెప్పారు. అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలనని తాను భావిస్తున్నానని పేర్కొన్న ఆయన, మంత్రివర్గంలో క్షత్రియులకు స్థానం కల్పించక పోవడంపై స్పందిస్తూ త్వరలో ఇస్తారేమో చూడాలన్నారు.

రాష్ట్రంలో ఎన్నో కులాలు ఉన్నాయని అన్ని కులాల వారికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించడం పెద్దాయనకు సాధ్యం కాకపోవచ్చునని పేర్కొన్నారు. తనకు ఏ ఆశలు లేవన్న ఆయన ఆశయం మాత్రం ఉందని తెలిపారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

### ఎక్కడ ఆపానో అక్కడి నుండే...

## తిరిగి ప్రారంభిస్తా

- మంత్రి నారా లోకేష్



మంగళగిరి, మహానాడు:
వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానాన్ని నెరవేర్చడానికి ప్రతి అవకాశాన్ని చేజిక్కించుకుంటా. ఈసారి, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగాల కల్పనలో ఇతర రాష్ట్రాలకు తీవ్రమైన పోటీ ఇస్తుంది. ఐటీ, ఎలక్ట్రానిక్ కంపెనీలను ఆకర్షించడానికి, రాష్ట్రం నుంచి వలస వెళ్లాల్సి వచ్చిన మన యువతకు ఉద్యోగాలు కల్పించడానికి నేను 2019లో వదిలి పెట్టిన చోటు నుండే పనిని తిరిగి ప్రారంభిస్తా.



## కొండా నివాసంలో ప్రజాదర్బార్



హన్మకొండ, మహానాడు:
హన్మకొండలోని రాంనగర్‌లోని తన నివాసంలో మంత్రివర్యులు కొండా సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గురువారం ఓ సిటీలోని క్యాంప్ ఆఫీసులో వందలాదిగా వచ్చిన ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి సాధ్యమైనంత వరకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు.

కాగా మంత్రి నివాసంలోనూ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే పరమావధిగా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని, తాను హైదరాబాద్‌లో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో వుండాలని, వీలైన వారు తనను హైదరాబాద్ లో కలవాలని మంత్రి సురేఖ సూచించారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలోనూ, హైదరాబాద్ సెక్రటేరియట్ కార్యాలయంలోనూ తాను అందుబాటులో ఉంటానని మంత్రి సురేఖ ప్రజలకు తెలిపారు.

## ఉల్లి 'ఘాటు'



దేశంలో ఉల్లి ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత కొద్ది రోజులు పెరుగుతున్న ఉల్లి ధరలు.. కొనే ముందే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఉల్లి సరఫరా తక్కువగా ఉండటమేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి..

దేశంలో ఉల్లిని ఉత్పత్తి చేసే అగ్ర గామి రాష్ట్రమైన మహారాష్ట్రలో కరువు వంటి పరిస్థితుల కారణంగా ఉత్పత్తిలో లోటు ఉందని చెబుతున్నారు. దీంతో దేశంలో గత రెండు వారాలలో ఉల్లి ధరలు 30 నుంచి 50 శాతం పెరిగాయి.

ఈ క్రమం లోనే కొందరు వ్యాపారులు ఉల్లిని నిల్వ చేసి.. ధరలు మరింతగా పెరిగేలా చేస్తున్నారని, అలా ధరలు పెరిగిన తర్వాత అమ్ముకోవాలని చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

హైదరాబాద్‌లో ఉల్లిపాయల ధరల విషయానికి వస్తే.. రిటైల్ ధర సుమారు 25 శాతం, హెూల్‌సేల్ ధర 15 శాతం పెరిగింది. ఏడాది క్రితం ఉల్లి రిటైల్ ధరలు కిలో రూ. 20 ఉండగా.. హెూల్ సేల్ ధర క్వింటాల్‌కు రూ. 1,581.97 గా ఉంది.

ప్రస్తుతం రిటైల్ ధరలు కిలోకు రూ. 40 నుంచి రూ. 50 మధ్య ఉంది. ఒక నెల క్రితం ఉల్లి కిలో ధర రూ. 20 నుంచి రూ. 30 వరకు ఉంది. నెల రోజుల వ్యవధి లోనే ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. అయితే, జూన్ 17న బక్రీద్ నేపథ్యంలో ఉల్లిపాయలకు దేశీయంగా భారీ డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

మరోవైపు.. సెప్టెంబరు, అక్టోబరు వరకు కొత్త ఖరీఫ్ పంట చేతికి వచ్చే అవకాశం లేక పోవడంతో ఉల్లి కిలో రూ. 50 నుంచి రూ. 60 దాట వచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఇక, దేశం లోని ఉల్లిలో 42 శాతానికి పైగా ఉత్పత్తి చేసే మహారాష్ట్ర.. తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా ఉత్పత్తిలో 15 నుంచి 20 శాతం తగ్గుదలని చవి చూసింది. మహారాష్ట్ర లోని 27 జిల్లాలలో 20 నుంచి 45 శాతం వరకు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయని గణంకాలు సూచిస్తున్నాయి.

## 'ఉమ్మడి కృష్ణా'కు కీలక శాఖలు

- కొల్లు రవీంద్రకు గనులు మరియు భూగర్భ, ఎక్సైజ్ శాఖలు
- కేపీ సారథికి సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ
- గతంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా వ్యవహరించిన కొల్లు
- వైఎస్ఆర్ మంత్రివర్గంలో పశు సంవర్ధక శాఖ మంత్రిగా వ్యవహరించిన సారథి

(రమణ)





ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథిలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక శాఖలను కేటాయిస్తూ శుక్రవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేశారు.

గనులు మరియు భూగర్భజల శాఖతో పాటు ఎక్సైజ్ శాఖను రవీంద్రకు కేటాయించగా కొలుసు పార్థసారథికి సమాచార పౌర సంబంధాల శాఖతోపాటు గృహ నిర్మాణ శాఖను కేటాయించారు.

మొత్తం నాలుగు శాఖలు ఉమ్మడి కృష్ణాకు వచ్చాయి. కొల్లు రవీంద్ర గతంలో ఎక్సైజ్, బీసీ సంక్షేమ, క్రీడలు, న్యాయ శాఖతోపాటు మొత్తం ఆరు శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. గతంలో నిర్వర్తించిన ఎక్సైజ్ శాఖను మళ్లీ రవీంద్రకు అప్పగించడం విశేషం.

ఇక కేపీ సారథి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఈ ప్రభుత్వంలో ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖతోపాటు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా చంద్రబాబు అవకాశం కల్పించారు.

## గొర్రెలపై 'కొండ'ంత ప్రేమ

వరంగల్, మహానాడు:
వరంగల్ నుండి హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యంలో గొర్రె పిల్లలతో వెళుతున్న గొర్రెల కాపరిని చూసి మంత్రి సురేఖ మధ్యలో కాన్వాయ్ ని ఆపారు. గొర్రె పిల్లలను చేతపట్టుకొని తన చిన్ననాటి స్మృతులను తలుచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో ఏయే పథకాలు గొర్రెల కాపరి కుటుంబానికి వర్తిస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి గొప్ప సంకల్పంతో కృషి చేస్తున్నదని తెలిపారు.





# పవన్‌కల్యాణ్.. రేపటి భవిష్యత్తు!

- నేటి విజయమే సేనాని వ్యూహం కాదు
- జనసేనాని విజయం వెనుక నమ్మలేని నిజాలు

మంగళగిరి, మహానాడు:
ఆంధ్ర ప్రదేశ్‌లో రెడ్డి, కమ్మ ఆధిపత్య పార్టీలు కాకుండా తృతీయ ప్రత్యామ్నాయం రావాలి. అధికార సాధన దిశగా అడుగులు వెయ్యాలి అనేది ఏడూ దశాబ్దాల పాలిత వర్గాల కల. ఈ కలను సాధించిన మొదటి వ్యక్తి కొణెదల పవన్ కళ్యాణ్.

ఏపీలో తృతీయ ప్రత్యామ్న్యాయం రావాలని ఒక రామ్ మనోహర్ లోహియా, ఒక అంబెద్కర్, ఒక కాన్షిరాం లాంటి వారు ఎన్నో కలలను కన్నారు. పార్టీలు అయితే ఎన్నో వచ్చాయి. కానీ అవి వెను వెంటనే కల గర్భంలో కలిసి పోతుండేవి. నిలదొక్కుకో లేదు.

సర్దార్ గౌతు లచ్చన్న, మంద కృష్ణ మాదిగ, ఆర్ కృష్ణయ్య, దాసరి నారాయణ రావు, చిరంజీవి, ముద్రగడ పద్మనాభం, కేసన శంకరరావు లాంటి వారు ఎందరో పార్టీలు పెట్టినప్పటికే అవి కాలగర్భంలో కలిసి పోయాయి.

పాలిత వర్గాల నుండి ఒక వ్యక్తి పార్టీ పెట్టడం, ఆ పార్టీ ఒక దశాబ్దం పైగా క్రియాశీల రాజకీయాల్లో ఉండడం, ఆ పెట్టిన పార్టీ ఒక గుర్తింపు పొందిన పార్టీగా మారడం అనేది జనసేననే. ఏడు దశాబ్దాల తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇప్పటి వరకు జరగలేదు. పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేన పార్టీ మాత్రమే దశాబ్దంపైగా నడవడం, ఎలక్షన్ కమిషన్ నుండి గుర్తింపు పొందడం జరిగింది. నాకు తెలిసినంత వరకు ఇది పాలిత వర్గాలు కోసం పవన్ కళ్యాణ్ సృష్టించిన చరిత్ర.

చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ పెట్టిన టీడీపీ అనే లెగసీ పై పార్టీని నడుపుతో టీడీపీ ద్వారా అధికారంలోకి వస్తున్నారు. జగన్ రెడ్డి అయితే తండ్రి వైస్సార్ లెగసీ, జాతీయ కాంగ్రెస్ ద్వారా వచ్చిన వలసల లెగసీ పై పార్టీని నడుపుతో అధికారంలోకి వస్తున్నారు. కానీ పవన్ కళ్యాణ్ ఏ లెగసీ లేకుండా పార్టీ పెట్టి నేటి విజయం సాధించారు.

పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేనకు ఎటువంటి లెగసీ లేదు. ప్రజారాజ్యం ఓటమి, కాంగ్రెస్ లో విలీనం, మూడు పెళ్లిళ్లు,



కాపు పూర్వీకుల తప్పుడు నిర్ణయాలు, కంపు పట్టిన కాపు టాగ్ అనే నాలుగు గుది బండలు పవన్ కళ్యాణ్ కాళ్లకు, మెడకు వేళ్ళాడుతుండగా ధైర్యంతో పెట్టిన పార్టీ జనసేన. పాలిత వర్గాల కోసం పవన్ కళ్యాణ్ సృష్టించిన చరిత్ర.

పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టేనాటికి మెగా కుటుంబం అండ లేదు. కాపు టాగ్ ఉంది గాని కాపు నాయకుల, కాపు సంఘాల మద్దతు జనసేనకు లేదు. పారిశ్రామిక వేత్తల అండ పవన్ కళ్యాణ్ కు లేదు. కుల నాయకుల సపోర్ట్ లేదు. మీడియా లేదు. అణగారిన వర్గాల్లో ఐక్యత లేదు. ఏకాకులుగా మారిన కాపుల పార్టీకి మా ఇతర కులాల మద్దతు నివ్వం అనే రోజుల్లో, దుర్భర పరిస్థితుల్లో ధైర్యంతో వచ్చిన పార్టీ జనసేన. పాలిత వర్గాల కోసం పవన్ కళ్యాణ్ సృష్టించిన చరిత్ర.

పార్టీ నడపడానికి ముఖానికి రంగులు వేసికొంటూ నాలుగు రాళ్లు సంపాదించడం, ఆ వచ్చిన డబ్బులతో పార్టీని నడపడం. ఇలా పది సంవత్సరాలు పైగా పార్టీని పవన్ కళ్యాణ్ నడుపుతో వచ్చాడు. గుప్పెడు నాయకులతో, గంపెడు విజయాన్ని పవన్ కళ్యాణ్ సాధించాడు. పాలిత వర్గాల కోసం పవన్ కళ్యాణ్ సృష్టించిన చరిత్ర.

అణగారిన వర్గాల కోసం పార్టీని పెట్టి, ఆ పార్టీని నడపడం కోసం పవన్ కళ్యాణ్ పడుతున్న కష్టాలను అర్ధం చేసికోకుండా విమర్శలు చేసిన వారే ఎక్కువ. అక్షర సత్యంతో సహా అనేక మంది సేనాని శీలాన్ని నిన్నటి వరకు శంకించిన గారే గాని పవన్ కళ్యాణ్ కి అండగా నిలిచిన వారు లేరు.

ఒక పక్కన అక్షర సత్యం లాంటి వారి తిట్లను, హేళనలను సేనాని వింటూనే మరొక పక్కన కష్టాలను భరిస్తూ, తానూ నష్టాల్లో ఉన్నాగాని తన స్వేదంతో వచ్చిన డబ్బులతో పార్టీని నడుపుతూ, ఒంటి చేత్తో పార్టీని విజయం వైపుకు తీసికెళ్ళిన వ్యక్తి పవన్ కళ్యాణ్. పాలిత వర్గాల కోసం పవన్ కళ్యాణ్ సృష్టించిన చరిత్ర.

అందుకే పవన్ కళ్యాణ్ సాధించిన నేటి ఈ విజయం మోహెూన్నతమైన విజయం. డిప్యూటీ సీఎం అనే పదవి చిన్నదే కావచ్చు. కానీ అది పవన్ కళ్యాణ్ తన సొంత మేధస్సుతో, వ్యూహాలతో సాధించిన విజయం. చీమకు చిప్పెడు నీళ్ళే మహా సముద్రం లా సేనాని నేడు సాధించిన డిప్యూటీ సీఎం పదవి అణగారిన వర్గాలకు గొప్పదే. అణగారిన గర్గాలకు, పాలిత వర్గాలకు ఈ విజయంపై ప్రపంచాన్ని జయించినంత ఆనందం.

ఒకరు పార్టీ కింద అయిన డిప్యూటీ సీఎంకి పవన్ తన రెక్కల కష్టంతో పెంచిన పార్టీ నుండి డిప్యూటీ సీఎం అయినది ఒక్కటి కాదు. ఈ వాస్తవాన్ని అణగారిన వర్గాలు, పాలిత వర్గాలు తెలిసికోవాలి. అవసరమైతే పాలక వర్గాలకు తల ఎత్తి చెప్పాల్సిన రోజు ఇది.

నేటి మన 21 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లను ఎంత మంచిగా ఉపయోగించు కొంటే మన జనసేన పార్టీ భవిత అంత ఎత్తుగా ఉంటుంది అని జనసేనాని పవన్ కళ్యాణ్ మొన్న ఎన్నికైన ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి అన్నారు.

దీన్ని బట్టి సేనాని వ్యూహాలను అర్ధం చేసుకోవచ్చు. సేనాని వ్యూహంలో నేటి విజయం ఒక భాగమే గానే నేటి విజయమే సేనాని వ్యూహం కాదు. రాబోయే రోజుల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ సాధించ బోతున్న విజయాలకు నేటి డిప్యూటీ సీఎం అనేది నాంది ప్రస్తావన. ఇదే వాస్తవం. ఇదే అక్షర సత్యం.

ఆలోచించండి... జనసేనాని పవన్ కళ్యాణ్ నేడు సాధించింది రేపటి భావి ఆంధ్ర సీఎం సాధనకి అవసరమైన సాధన సంపత్తికి తొలి మెట్టు అని ఎలుగెత్తి చెప్పండి. అంతే గాని వైసీపీ ట్రాప్‌లో పడి సేనానిని వ్యూహాలను శంకించకండి. ఇది అక్షర సత్యం!

- రమణ, మచిలీపట్నం

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

# పంతులమ్మ నుంచి పోలీసు మంత్రి వరకూ..

- వంగలపూడి అనిత రాజకీయ ప్రస్థానం



అమరావతి, మహానాడు:

పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితను హోం మంత్రి పదవి వరించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ మహిళలకే హోం మంత్రి పదవి దక్కగా.. చంద్రబాబు కూడా హోంమంత్రిగా మహిళనే నియమించారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఈ మంత్రివర్గంలో పదవి దక్కించుకున్న ఏకైక ఎమ్మెల్యే వంగలపూడి అనిత. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంతో మంది సీనియర్ నేతలు ఉన్నప్పటికీ.. పార్టీ పట్ల ఆమె చూపిన విధేయతకు మంత్రి పదవిని కేటాయించిన చంద్రబాబు.. ఈసారి ఏకంగా హోంమంత్రిని చేశారు.

ఈ ఎన్నికల్లో టీడీపీ పాయకరావుపేట నుంచి మరోసారి వంగలపూడి అనితకు అవకాశం ఇచ్చింది. అధినేత నమ్మకాన్ని నిలబెడుతూ రికార్డు విక్టరీ కొట్టారు వంగలపూడి అనిత. స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులను కలుపుకుని వెళ్లి 2024 ఎన్నికల్లో పాయకరావు పేట అసెంబ్లీ స్థానం నుంచి 43,727 ఓట్ల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించారు.


ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు దక్కించుకోవటమే కాకుండా.. హోం మంత్రిగా నియమితుల య్యారు. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు వంగలపూడి అనిత. 2014కు ముందు టీడీపీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన అనిత 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.

2014 నుంచి 2019 వరకు పాయకరావుపేట ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఆమెను.. పాయకరావుపేట నుంచి కొవ్వూరుకు పంపింది. అయితే 2019 ఎన్నికల్లో ఓడి పోయినా.. కూడా టీడీపీ కోసం వంగలపూడి అనిత పనిచేశారు.

తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేస్తూ వైసీపీ విధానాలను ఎండగడుతూ వచ్చారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్నా వెనక్కి తగ్గలేదు.

# ఇదో అద్భుతం

- నాలుగు లైన్ల మహాద్భుతం
- చార్‌ధామ్ క్షేత్రాలను కలుపుతూ 900 కిలోమీటర్ల రహదారి
- 12,000 కోట్ల వ్యయం



ఛార్‌ధామ్: 12,000 కోట్ల వ్యయంతో ఛార్‌ధామ్‌లో భాగమైన గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బదిరీనాథ్ క్షేత్రాలను కలుపుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే 4 లైన్ల రహదారులు ఈ రహదారుల పొడవు 900 కి.మీ ఏ క్షేత్రం నుంచి ఏ క్షేత్రానికైనా నేరుగా వెళ్ళవచ్చు. ఇప్పటిలా కొంత దూరం వెనుదిరిగి ప్రయాణించాల్సిన అవసరం లేకుం డానే ఈ ప్రాజెక్టును ఆల్ వెదర్ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు.

అంటే సంవత్సరంలో ఎప్పుడైనా ప్రమాదం లేకుండా ప్రయాణించవచ్చు. ఈ ప్రాజెక్టు జీవితం కాలం 100 ఏళ్ళు. 2013లో వచ్చిన వరదలకు ఇటువంటి రహదారులు లేకపోవ డంతో, ఉన్న అతి ఇరుకైన దారులు కొండచరియలు పడి పూడిపోవడంతో వేలాదిమంది గల్లంతైనారు. 2020 మార్చి నుండి ఈ రహదారి అందుబాటులో ఉన్నది.



# శ్రీకాళహస్తి ఆలయంలో సాయికుమార్ పూజలు

శ్రీకాళహస్తీ,మహానాడు:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి తెలుగు చలనచిత్ర హీరో సాయికుమార్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తి స్వామి వారి దేవస్థానానికి విచ్చేశారు. వారిని ఆలయ ఏఈఓ సతీష్ మల్లి స్వాగతం పలికి ప్రత్యేక రాహు కేతు పూజ అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు.

శ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద ఆలయ అధికారులు సాయికుమార్ కుటుంబం సభ్యులను శేష వస్త్రంతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అంద జేశారు. వేద పండితులు వేదమంతురాలతో ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ సతీష్ మల్లి,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్, టెంపుల్ సూపర్డెంట్, సి.ఎస్.ఓ నాగ భూషణం యాదవ్ మరియు ఆలయ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలో పెడదాం...

- ప్రభుత్వ సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేద్దాం
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి, మహానాడు:

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలో పెట్టడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సఫలీకృతమయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలుబీ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా నియమితులైన కొలుసు పార్థసారథిని శుక్రవారం పెనమలూరు మండలం, తాడిగడప కామినేని ఆసుపత్రి రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు అందజేశారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రచార విధివిధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటి సమాచార, పౌర సంబంధాల శాఖ పనితీరు ఎంతో కీలకమైందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి అమలుచేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో వినూత్న విధానాలను అవలంబించాల్సిన అవసరముందన్నారు.

ప్రస్తుతం అమలుచేస్తున్న విధానాలతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని భిన్న ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంలో



సఫలమైనప్పుడు, వాటిని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడు ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలో పెట్టిన వారమవుతామని అన్నారు.

ఈ దిశగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమన్వయపరచుకొని ముందుకు వెళ్లాలని మంత్రి కొలుసు పార్థసారథి సమాచార శాఖ అధికారులకు సూచించారు.

మంత్రిని కలిసిన వారిలో సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్, టి.కస్తూరిబాయి, చీఫ్ ఇంజనీర్ ఒ.మధు సూధన్‌రావు, ఆర్ఐఈ సీవీ కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్రరావు, ఏడీలు జీవీ ప్రసాద్, ఎం.భాస్కర్ నారాయణ, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు వీవీ ప్రసాద్, వివిధ విభాగాల అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మంత్రి సవితకు వర్ల సన్మానం

- పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత

మంగళగిరి:

శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిచిన మొదటిసారే మంత్రిపదవి చేపట్టిన సంజీవరెడ్డిగారి సవిత మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంకు విచ్చేసి రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈందర్భంగా వర్లరామయ్య ఆమెను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం చంద్రబాబు గురుతరమైన బాధ్యతను అప్పగించినట్లు.. మంత్రిగా రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన మంత్రి సవితకు సూచించారు. రాజకీ యంగా ప్రజా సేవలో తరించి.. ప్రజల మనసును, మనన్నలు చూరగొనాలని సూచించారు. మునుముందు రాజకీయంగా మరితంగా ఎదగాలని ఆకాంక్షించారు.

మహిళలు మంత్రులుగా బాధ్యతలు చేపట్టడం గర్వకారణ మన్నారు. మహిళా లోకానికి మంచి చేసి మహిళాభివృద్ధికి తోడ్పడాలని వర్లరామయ్య మంత్రి సవితకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ పాల్గొన్నారు.

# యడియూరప్పను అరెస్ట్ చేయవద్దు

- హైకోర్టు ఆదేశం




కర్ణాటక,మహానాడు:

కర్ణాటక మాజీ సీఎం, బీజేపీ సీనియర్ లీడర్ యడియూరప్పను జూన్ 17 వరకు అరెస్ట్ చేయొద్దని ఆ రాష్ట్ర హైకోర్టు సీఐడీ ని ఆదేశించింది. ఆయన జీవిత చరమాంకంలో ఉన్నారని, అనారోగ్య సమస్యలూ ఎదుర్కొంటున్నారని కోర్టు పేర్కొంది.కాగా పోక్సో చట్టం కింద యడియూరప్పపై కేసు నమోదవగా నిన్న ఆయనకు బెంగళూరులోని ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో యడ్డీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడితో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ





# పెద్దిరెడ్డి పాపాలపై కమిటీ వేయాలి

- గత అయిదేళ్ల అరాచకాల నిగ్గు తేల్చాలి
- బాధితులకు న్యాయం చేసి, దోషులను శిక్షించాలి
- పెద్దిరెడ్డి కుటుంబం దోచుకున్నది కక్కించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకి బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ లేఖ

**విజయవాడ,మహానాడు:** అధికారం అడ్డం పెట్టుకొని.. అరాచకాలు, అక్రమార్జన చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహారంపై నిజాలు నిగ్గు తేల్చి, అక్రమాలు బయట పెట్టేందుకు కమిటీలను నియమించాలని.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి శుక్రవారం లేఖ రాశారు.. పెద్దిరెడ్డి దొచ్చుకున్నది కక్కించి, అతని బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ.. పలు కీలక అంశాలు ఈ లేఖలో ప్రస్తావించారు.. ఈ పూర్తి లేఖ సారాంశం ఇదే..

“గౌరవనీయులు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు..
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి..

అయ్యా..

మీ విజయం చిరస్మారకం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మకం.. మీ రాజకీయ జీవితంలో సార్థకం..! అందుకే మీ అద్భుత విజయానికి ముందుగా మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. మీతో సహా గెలిచిన కూటమి ప్రజా ప్రతినిధులు, మంత్రివర్గ సభ్యులు అందరికీ శుభాకాంక్షలు.. మీ నేతృత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చి, గత పాపాలను కడిగి, రాష్ట్రానికి తగిలిన గాయాలను రూపుమాపి, మంచి చేస్తూ.. గతంలో మీ హయాంలో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా చూసుకుంటారని విశ్వసిస్తున్నాను..

గత అయిదేళ్ల చేదు జ్ఞాపకాలు, చెత్త పాలన, అరాచకాలు, అన్యాయాలు, అక్రమాలు మీకు తెలియనివి కాదు.. ముఖ్యంగా మన సొంత జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనే అరాచక రాజ్యాంగేతర శక్తి ఎన్నో పాపాలు, పాతకాలతో రాజ్యమేలింది.. వాటిపై సమగ్ర విచారణ జరిపుతారని ఈ లేఖ..

గత అయిదేళ్లలో మంత్రిగా, అధికారం అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గనుల్లో విచ్చలవిడిగా దోచుకున్నారు. ప్రతీ క్వారీ, ప్రతీ ఖనిజ నిక్షేపాల్లో తమ అనుచరులను పెట్టీ అక్రమార్జన చేశారు. అలాగే విద్యుత్తు శాఖలో కాంట్రాక్టులు, ఒప్పందాలు, కేటాయింపులు ద్వారా రూ. వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారు. వీటిపై విచారణకు ఒక ప్రత్యేక కమిటీని వేసి నిజాలు నిగ్గు తేలుస్తారనీ..



మీ సొంత నియోజకవర్గం కుప్పం సహా పంగనూరు, పలమనేరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజక వర్గాలతో సహా మూడా అథారిటీ అడ్డం పెట్టుకొని పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు చేసిన అరాచకాలు, భూ కబ్జాలు, ఆగడాలపై సమగ్ర విచారణకు ఒక ప్రత్యేక కమిటీని వేసి నిజాలు నిగ్గు తేలుస్తారని..

గత అయిదేళ్లలో పుంగనూరు సహా చుట్టు పక్కల నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలపై జరిగిన దాడులు, వేధింపులు, అక్రమ కేసులపై విచారణకు ఒక ప్రత్యేక కమిటీని వేసి నిజాలు నిగ్గు తేలుస్తారని..

పెద్దిరెడ్డి అతని అనుచరులు, కుటుంబ సభ్యుల గత అయిదేళ్ల అరాచక వ్యవహారాల్లో బాధితులుగా నేను, మీరు, మనతో సహా వేలాది మంది అమాయక ప్రజలు, సాధారణ కార్యకర్తలు కూడా ఉన్నారు.. వారందరికీ న్యాయం జరగాలంటే, రాష్ట్రంలో న్యాయం నిలబడాలంటే, నిజాలు తెలియాలి, విచారణ జరగాలి.. ముఖ్యమంత్రిగా ఈ బాధ్యత తమరిపై ఉన్నదని తెలియజేస్తున్నాను.

# ఏం జరిగిందో దేవుడికే తెలియాలి

(మొదటిపేజీ తరువాయి..)

గడచిన ఐదేళ్లలో ఎప్పుడూ చేయలేని విధంగా మంచి పరిపాలన అందించాం

మేనిఫెస్టోలో 99శాతం హామీలు అమలు చేశాం. ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ ఇలా ఎవ్వరూ చేయలేదు. చాలా చిత్తశుద్ధితో పనిచేసి, మేనిఫెస్టోను అమలు చేశాం. ఏ నెలలో ఏం ఇవ్వబోతున్నామో క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేశాం. ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థలను దారుణంగా దెబ్బతీసిన కోవిడ్ లాంటి సంక్షోభాలు ఉన్నప్పటికీ, ఆ సవాళ్లను అధిగమించి ప్రజలకు మంచి చేశాం.

విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఎప్పుడూ చూడని సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రజల ఇంటి వద్దకే పరిపాలనను తీసుకెళ్లాం. అవినీతికి చోటులేకుండా, వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశాం. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందించాం.

విద్యారంగంలో మనం తీసుకొచ్చిన సంస్కరణలతో పేదరిక నిర్మూనలదిశగా అడుగులు వేశాం. భవిష్యత్తు తరాలను ప్రపంచస్థాయిలో నిలబెట్టేందుకు ఇంగ్లిషు మీడియం, టోఫెల్, ఆరో తరగతి నుంచి డిజిటల్ టీవీలు, ఎనిమిదో తరగతి నుంచి ట్యాబులు అందించాం. ఐబీ సిలబస్‌ని కూడా తీసుకు వచ్చాం.

ప్రఖ్యాత యూనివర్శిటీల కోర్సులను విద్యార్థులకు అందించాం. నాణ్యమైన విద్యాను శాశ్వతంగా అందించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించేదిశగా ఐదేళ్లలో అడుగులు వేశాం. సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా ఎప్పుడూ చూడ విధంగా వివిధ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవకాశాలు కల్పించాం.

ఇన్ని గణనీయమైన మార్పులు తీసుకువచ్చినప్పటికీ ఎన్నికల ఫలితాలు ఇలా వచ్చాయంటే చాలా ఆశ్చర్యమేస్తోంది. శకుని పాచికలు మాదిరిగా ఈ ఎన్నికలు ఫలితాలు వచ్చాయనిపిస్తోంది. ఏం జరిగిందో దేవుడికే తెలియాలి.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొచ్చినప్పుడు అసెంబ్లీ సాక్షిగా టీడీపీ మద్దతు పలికింది. అమెరికా, యూరప్ దేశాల్లో అనుసరిస్తున్న మంచి విధానాలన్నీ ఇందులో ఉన్నాయని సభ సాక్షిగా ప్రశంసలు కురిపించింది.

కాని, సరిగ్గా ఎన్నికల సమయంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ఒక భూతంలా చూపి టీడీపీ, కూటమి పార్టీలు విషప్రచారం చేశాయి. నిజంగా ఈ చట్టాన్ని తీసుకురావాలంటే.. అంత సులభమైన విషయం కాదు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేలమంది సర్వేయర్లను నియమించడం వల్లే సాధ్యపడే పరిస్థితులు వచ్చాయి.

భూమి కొనాలన్నా, అమ్మాలన్నా.. మోసాలకు ఎలాంటి ఆస్కారం లేని పరిస్థితులు ఈ చట్టంవల్ల వస్తాయి. చరిత్రలో తొలిసారిగా భూ పత్రాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. ఈ పత్రాల విషయంలో తప్పులు జరిగితే సదరు వ్యక్తికి ప్రభుత్వమే పరిహారం ఇస్తుంది. టీడీపీ వాళ్లు మద్దతు పలికిన చట్టాన్ని ఇప్పుడు వాళ్లే తీసేస్తామంటున్నారు. వారి చేస్తున్న రాజకీయాలు ఎలా ఉంటాయో దీనిబట్టే తెలుస్తుంది.

వైయస్సార్సీపీని నమ్మకుని కొన్ని కోట్ల కుటుంబాలు ఉన్నాయి. కొన్ని లక్షలమంది కార్యకర్తలు ఈ పార్టీపై ఆధారపడి ఉన్నారు. కొన్ని వేలమంది నాయకులు పార్టీలో ఉన్నారు. అనుకున్న లక్ష్యాల దిశగా పార్టీ ముందుకు కొనసాగాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికల్లో మనకు 40శాతం ఓట్లు వచ్చాయి. గడచిన ఎన్నికలతో పోలిస్తే 10 శాతం ఓట్లు తగ్గాయి.

రానున్న రోజుల్లో ఈ 10శాతం ప్రజలే మన పాలనకు, ఇప్పటి ప్రభుత్వం పాలనకు తేడాను గుర్తిస్తారనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ప్రతి ఇంట్లోకూడా మన ప్రభుత్వం చేసిన మంచి ఉంది. ఎట్టి పరిస్థితుల్లో మనలో ధైర్యం సన్నగిల్లకూడదు. మనలో పోరాటపటిమ తగ్గకూడదు. నా వయసు చిన్నదే. నాలో సత్తువ ఇంకా తగ్గలేదు. 14 నెలలు పాదయాత్ర చేశాను. దేవుడుదయ వల్ల అన్నిరకాల పోరాటాలు చేసే శక్తి కూడా ఉంది. ప్రజలు మళ్లీ మనల్ని అధికారంలోకి తీసుకు వస్తారనే నమ్మకం, విశ్వాసం నాకు ఉన్నాయి.

పార్లమెంటులో మనకు 11 మంది రాజ్యసభ సభ్యులు, 4గురు లోక్‌సభ సభ్యులు ఉన్నారు. మొత్తంగా 15 మంది ఎంపీలు మన పార్టీకి ఉన్నారు. టీడీపీకి 16 మంది ఉన్నారు. అందువల్ల మన పార్టీకూడా చాలా బలమైనదే. మనల్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు. మనం ధైర్యంగా ఉండి ప్రజల తరఫున పోరాటంచేయాలి. 2019–24 మధ్య ప్రభుత్వం ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు మన పరిపాలనాకాలం ముగిసిందో తెలియదు. ఈసారికూడా అంతే. ఐదేళ్లు ఇట్టే గడిచిపోతాయి.

పార్లమెంటులో వ్యవహరించేటప్పుడు ప్రజాహితమే ధ్యేయం కావాలి. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంశాలవారీగానే మద్దతు ఉంటుంది. ఎవరికైనా గాని, అంశాలవారీగానే మద్దతు ఉంటుంది. పార్టీ విధివిధానాల ప్రకారం ఎంపీలు ముందుకు సాగాలి. ప్రజలముందు తలెత్తుకునేలా పార్లమెంటులో ఎంపీలు ముందుకుసాగాలి.

రాజకీయంగా ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు తాత్కాలికం. మన పరిపాలనను, చంద్రబాబు పరిపాలనను ప్రజలు గమనిస్తూనే ఉంటారు. కచ్చితంగా మనం తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతామనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. ఈలోగా మనం ధైర్యాన్ని కోల్పోకూడదు.

– విలువలు, విశ్వసనీయతతో ముందడుగులు వేయాలి.

ఇదివరకటి లాగానే రాజ్యసభలో పార్టీ నాయకుడిగా విజయసాయిరెడ్డి కొనసాగుతారు.

లోక్‌సభలో పార్టీ నాయకుడిగా మిథన్ రెడ్డి వ్యవహరిస్తారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వై.వి.సుబ్బారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తారు. అందరికీ నేను అందుబాటులో ఉంటాను. ఎంపీలంతా కలిసి కూర్చుని చర్చించుకుని ఆ మేరకు అడుగులు ముందుకేయాలి.

పార్టీపరంగా వ్యవహరించాల్సిన అంశాలను పరస్పరం చర్చించుకుని, నిర్ణయాలు తీసుకోండి. ఎంపీలుగా మీరు వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిగా ఉండాలి. మన పార్టీకి ఒక సిద్ధాంతం, గుర్తింపు ఉన్నాయి.పార్టీ కోసం మీరు కష్టపడండి. పార్టీ మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటుంది

# ఉప్పు తప్పు

స్వానుభవంతో చెబుతున్నా. రాళ్ళ ఉప్పు మిక్సీ వాడి సన్నగా మార్చుకుని వాడండి
అయోజైజ్డ్ సన్నఉప్పును 20/- పెట్టి.. కొని రోగాలు తెచ్చుకోకండి.

మనిషి తన ఆహారంలో సముద్రపు ఉప్పు తగిలితే మంచి రుచి వస్తుందనే విషయం కనుక్కున్నప్పటి నుంచీ తరతరాలుగా, వేల ఏళ్లుగా... సముద్రపు ఉప్పునే వాడుతూ వస్తున్నాడు.

అప్పట్లో బీపీలు లేవు, వొంట్లో ఎముకల నొప్పులు లేవు. థైరాయిడ్ సమస్యల్లేవు.

మీకు గుర్తుందా..?

ఊళ్లల్లో కిరాణ షాపుల ముందు బస్తాల కొద్దీ ఈ దొడ్డు ఉప్పు బస్తాలు జస్ట్, అలా వదిలేస్తారు ఎందుకంటే ఉప్పును ఎవరూ దొంగతనం చేయరు. ఎవరైనా ఉప్పు ఉచితంగా అడిగితే నిరాకరించవద్దనే నియమం కూడా ఉండేది.

ఆ రోజులు పోయాయి. అంతా సన్న ఉప్పు, అదీ అయోడైజ్డ ఉప్పు మన కిచెన్లలోకి వేగంగా జొరబడింది.

దొడ్డు ఉప్పుతో పోలిస్తే ఇది సన్నగా, అంటుకోకుండా ఉండటంతో అందరూ దీన్నే ప్రిఫర్ చేయసా. కానీ ఇది ప్రజల ఆరోగ్యానికి విపరీతంగా హాని చేయడం మొదలుపెట్టింది.

ఏళ్లకేళ్లు మనకేమీ పట్టడం లేదు.

అదెలా స్టార్టయిందంటే?

1986 ప్రాంతంలో. కార్పోరేట్లు సర్కారును అప్రోచయ్యారు. ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజలు అయోడిన్ లోపంతో బాధపడుతున్నారు కాబట్టి, వారికి అయోడిన్ కలిపిన ఉప్పును అలవాటు చేస్తే ఆరోగ్యవంతులైపోతారు అని చెప్పారు

అధ్యయనాలు లేవు, ముందు జాగ్రత్తలు లేవు, మరి కార్పోరేట్లు కదా.సర్కారు ఓకే అనేసింది

అయోడైజ్డ ఉప్పు వాడాలి అంటూ సముద్రపు ఉప్పును నిషేధించి పారేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో అయోడిన్ లోపం ఉంటే, మరి మిగతా దేశం మొత్తానికీ ఈ నిర్బంధ లవణం దేనికి అని అడిగినవాడు లేడు.



రోగికి చెప్పాల్సిన ప్రిక్షిప్షన్ దేశమంతా ఎందుకు వాడాలి అని అడిగిన వాడు లేడు. మరి కార్పొరేటు లాబీయింగు అలాగే ఉంటుంది.

కార్పోరేట్లు పెద్ద ఎత్తున కెమికల్ ప్రాసెస్ ద్వారా ఈ ఉప్పు తయారీ చేసి అమ్మడం స్టార్ట్ చేశారు. మామూలు ఉప్పుకి నాలుగైదు రెట్లు ధర ఎక్కువ. చివరకు ప్రజల కూడు నుంచి చౌక ఉప్పును కూడా కాజేసిన దొంగలు. తరువాత అనేక కంపెనీలు ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టారు.

ప్రజల్లో ఒక అభిప్రాయం ఎంత బలంగా ఏర్పడిందీ అంటే సముద్రపు ఉప్పు ప్రమాదకరం, అయోడైజ్డ ఉప్పు మాత్రమే ఆరోగ్యకరం అనే భావనలు జీర్ణించుకుపోయాయి.

మెల్లిమెల్లిగా దీని దుష్ప్రభావాలు అర్థం కాసాగాయి. ఈ అయోడైజ్డ ఉప్పులో మూడు ముఖ్యమైన సైనైడ్ అంశాలుంటయ్.

అవి

1) E535 -- sodium ferrocyanide,
2) E536 -- potassium ferrocyanide,
3) E538 -- calcium ferrocyanide……

మరికొన్ని అనారోగ్య హేతువులుంటయ్

ఇవి బీపీలను పెంచినయ్. థైరాయిడ్, ఒబెసిటీ వంటి సమస్యల్ని పెంచినయ్

గుండె జబ్బుల్ని పెంచినయ్

డయాగ్నయిజ్ లేబరేటరీలు హేపీ, మందుల కంపెనీలు హేపీ, డాక్టర్లు హేపీ.

విధి లేక ఆయుర్వేద డాక్టర్లు, హోమియో డాక్టర్లు సైంధవ లవణాన్ని సూచించసా. కానీ ధర ఎక్కువ. ప్రజలకు దాని ఉపయోగాలపై అవగాహన తక్కువ. ఇప్పటికీ కిచెన్లలో సైంధవ లవణం లేదా సముద్రపు సహజలవణం మంచిది.

నిజానికి దేశంలోని అనేక ప్రాంతాల్లో అయోడిన్ లోపం లేదు. కానీ మనం ఈ అయోడైజ్డ ఉప్పు పేరిట మన దేహాల్లోకి అదనంగా అయోడిన్‌ను పంప్ చేయడం స్టార్ట్ చేశాం. దీంతో మనమే చేజేతులా అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టవుతున్నది

అమెరికా వంటి దేశాల్లోనూ ఈ తప్పు తెలుసుకుని, నివారణ చర్యల్లో పడ్డయ్. మన దేశంలోనూ ప్రభుత్వ ఆంక్షల్ని ధిక్కరిస్తూ మరీ సముద్రపు ఉప్పు అమ్మడం స్టార్టయింది.

పాతకాలంతో పోలిస్తే ధరలు ఎక్కువ. మరేం చేస్తాం..? కానీ రూల్స్ అలాగే ఉన్నయ్. దీనిమీద గత ఏడాది కర్నాటక హైకోర్టులో ఓ పిల్ దాఖలైంది.

మరి జనం ఏం చేయాలి?

ఏముందీ?

ఆ దిక్కుమాలిన ఉప్పును తగ్గించేసి, వీలైనంతవరకూ దొడ్డు ఉప్పు అనగా సముద్రపు ఉప్పు, సహజలవణం వైపు మళ్లడం బెటర్.

మార్కెట్‌లో బాగానే దొరుకుతున్నది ఇప్పుడు.

అయితే నెట్‌లో వెబ్‌సైట్లలో ఇటీవల కొన్ని ఉచిత సలహాలు కనిపిస్తున్నయ్

ఏమనీ అంటే..?

ఈ ఉప్పును నీటిలో కరగబెట్టి కాస్త కాస్త తాగితే బీపీ తగ్గుతుందీ, ఇంకేవో రోగాలు పోతాయ్ అని తప్పు, అలాంటి వాటి జోలికి పోవద్దు. ఉప్పు వాడకమే తగ్గించడం చాలా మంచిది. సైంధవ లవణం అయితే మరీ మేలు.

ఏ ఉప్పయినా సరే అందులో ఉండేది సోడియం. అది రక్తపోటుకు మంచిది కాదు. అందుకని ఆ వెబ్ డాక్టర్ల జోలికి పోకుండా, జస్ట్, వంటలకు తగినంత. వీలయితే కాస్త తగ్గించుకుని వాడితే మరీ మరీ బెటర్.

ఉప్పు కేవలం రుచి కోసమే. ఆరోగ్యం కోసం కాదు. మనం రోజూ తీసుకునే రకరకాల ఆహారాల్లో ఎలాగూ కొంత సోడియం ఉంటుంది.

అందుకని బీ కేర్ ఫుల్

ఈ ప్రభుత్వాలు మనల్ని ఏమీ ఉద్ధరించవు. మరి పార్టీలకు, నాయకులకు కార్పొరేటు కంపెనీలు డబ్బులిస్తాయి తప్ప జనం ఇవ్వరు కదా?

వాటికి, వారికి ఈ దేశం ఉప్పు తింటున్నామనే విశ్వాసం కూడా ఉండదు కదా?

**- శ్యాంసుందర్ వరయోగి**

8

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, జూన్ 2024

# ప్రతిభావంతులను ప్రోత్సహించడమే మా సంస్థ లక్ష్యం

**- దర్శకనిర్మాత రామ్ గోపాల్ వర్మ**

చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే యువ ప్రతిభావంతులను ప్రోత్సహించడమే తమ ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యమని అన్నారు ప్రముఖ దర్శక నిర్మాత రామ్ గోపాల్ వర్మ. ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ వివరాలను ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్ లో రామ్ గోపాల్ వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో పోటీకి ఎంపికైన షార్ట్ ఫిలింస్ మేకర్స్, ఆర్జీవీ డెన్ ప్రొడ్యూసర్ రవి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఈ కాంటెస్ట్‌కు ఎంట్రీలు రావడం విశేషం.

ఇండస్ట్రీతో ఒక యాక్సెస్ ఇచ్చే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కాంటెస్ట్ ఆర్జీవీ యువర్ ఫిల్మ్. ఈ కాంటెస్ట్ అనౌన్స్ చేసిన తర్వాత దాదాపు 400 ఎంట్రీలు వచ్చాయి. ఇవి వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఉన్నాయి. వీటిలో 11 షార్ట్ ఫిలింస్ షార్ట్ లిస్ట్ చేసి ఎంపికచేశాం. నార్త్ ఇండియా నుంచి కూడా వచ్చాయి గానీ అవి షార్ట్ లిస్ట్ కాలేదు. షార్ట్ లిస్ట్ అయిన వాటిని సోషల్ మీడియాలో పోల్ కు పెట్టి ప్రేక్షకులు ఎక్కువమంది బెస్ట్ డైరెక్టర్ గా ఓటు వేసిన వారికి మా సంస్థలో అవకాశం ఇస్తాం. పేర్లు చెప్పను గానీ ఇప్పటికే వీరిలో నుంచి ఇద్దరిని సెలెక్ట్ చేశాను. వారికి సినిమా అవకాశం ఇవ్వబోతున్నాం. ఒక్క డైరెక్టర్స్ అనే కాదు. డీవోపీ, మ్యూజిక్



ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ - మొదటి సినిమా శివ సమయంలో నా గురించి ఎవరికీ తెలియదు. శివ సినిమా ప్రేక్షకాదరణ పొందింది కాబట్టి రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో అందరికీ తెలిసింది. కానీ ప్రతిభ ఉండి నాలా ఇంకా ప్రపంచానికి తెలియాల్సిన వారు ఎంతోమంది ఉన్నారు. మా నాన్న అన్నపూర్ణ స్టూడియోలో సౌండ్ ఇంజినీర్ కాబట్టి నాకు సినిమా ఇండస్ట్రీలోకి వచ్చేందుకు వీలు దొరికింది. వచ్చాక నేను ఏం చేశాను అనేది తర్వాత విషయం. ముందు మన కాన్సెప్ట్ చెప్పేందుకు ఎవరో ఒకరు అవకాశం ఇవ్వాలి కదా. వివిధ ప్రాంతాల్లో సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటూ తమలో ఎంతో ప్రతిభ ఉండి కూడా అవకాశాలు పొందలేకపోతున్న వారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారికి డైరెక్షన్ ఇలా..ప్రతి క్రాఫ్టులో టాలెంటెడ్ వారిని సెలెక్ట్ చేస్తున్నాం. ఈ పోల్ కు రెండు వారాల టైమ్ తీసుకుంటాం. ఈ షార్ట్ ఫిలింస్ చేసిన వారు నాకంటే బాగా డైరెక్ట్ చేశారు. ఈ షార్ట్ ఫిలింస్ లో మీరు ప్రొడక్షన్ వ్యాల్యూస్ చూడొద్దు. కాన్సెప్ట్ ను ఎంతబాగా కన్వే చేశారనేది మాత్రం చూడమని కోరుతున్నా. ఎందుకంటే మంచి ప్రొడక్షన్ వ్యాల్యూస్ సినిమాలు చూసిన మీకు వీరు అతి తక్కువ రిసోర్సెస్, బడ్జెట్ లో చేసిన మూవీస్ నచ్చకపోవచ్చు. ఈ కాంటెస్ట్ లో సెలెక్ట్ అయిన వారి ప్రతిభను ముందుగా మా సంస్థలో ఉపయోగించుకోవాలనేది నాది, ప్రొడ్యూసర్ రవి గారి స్వార్థం. అంతేగానీ వీళ్లందరికీ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలనేది ఒక్కటే ఆలోచన కాదు. ఆ తర్వాత వాళ్లు మమ్మల్ని వదిలేసి వెళ్తారనే విషయం కూడా తెలుసు అన్నారు.

# రాబిన్‌హుడ్ నుంచి లేడీ బాస్ నీరా వాసుదేవ్



హీరో నితిన్ యూనిక్ యాక్షన్, హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ 'రాబిన్‌హుడ్'లో డాజ్లింగ్ దివా శ్రీలీల ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. శ్రీలీలాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ ఆమె పాత్రను లేడీ బాస్ నీరా వాసుదేవ్‌గా పరిచయం చేశారు. శ్రీలీల తన చుట్టూ టైట్ సెక్యూరిటీతో ప్రైవేట్ జెట్‌లో దిగినట్లు ఈ వీడియో ప్రజెంట్ చేస్తోంది.

ఆమె వెయిట్ తెలియకపోయినా హెడ్ వెయిట్ ఇన్ఫినిటీ. ఆమె యారోగెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తుంది. టీజర్‌లో "జ్యోతీ, సునామీలో టి సైలెంట్ ఉండాలి... నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అని శ్రీలీల చెప్పిన డైలాగ్ అలరించింది. మూవీలో శ్రీలీల పాత్ర, నితిన్ పాత్రకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నితిన్, శ్రీలీల పాత్రలు రాయడంలో వెంకీ కుడుముల స్పెషల్ కేర్ తీసుకున్నారు. విజువల్స్ గ్రాండ్‌గా అనిపించాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్-క్లాస్‌గా వున్నాయి. నట కిరీటి రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ఫాదర్స్ డే స్పెషల్: చైతన్య రావ్ 'డియర్ నాన్న'

యంగ్ ట్యాలెంటెడ్ చైతన్య రావ్, యష్ణ చౌదరి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డియర్ నాన్న'. సూర్య కుమార్ భగవాన్ దాస్, సంధ్య జనక్, శశాంక్, మధు నందన్, సుప్రజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. అంజి సలాది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాకేష్ మహంకాళి నిర్మించారు. ఫాదర్ డే స్పెషల్‌గా ఈ చిత్రం జూన్ 14న నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే విడుదలైన డియర్ నాన్న ట్రైలర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కరోనా బ్యాక్ డ్రాప్,



ఫాదర్ ఎమోషన్, చైతన్య రావ్, సూర్య కుమార్ భగవాన్ దాస్ మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ చాలా క్యురియాసిటీని పెంచాయి. ప్రొడక్షన్ వాల్యూస్, కంటెంట్ యూనిక్‌గా వున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్, ముఖ్యంగా ఫాదర్ అండ్ సన్ మధ్య వచ్చే సీన్స్ మనసుని హత్తుకున్నాయి. ఫాదర్స్ డే కి డియర్ నాన్న పర్ఫెక్ట్ ట్రీట్. ఈ చిత్రంలో సివిఎల్ నరసింహ, ఆదిత్య వరుణ్, వినీల్ ఇతరకీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిత్ కుమార్ మాధాడి డీవోపీగా పని చేస్తున్న ఈ చిత్రానికి గిఫ్టన్ ఎలియాస్ మ్యూజిక్ డైరెక్టర్. శ్రవణ్ కటికనేని ఎడిటర్. కృష్ణ చైతన్య లిరిక్స్ అందిస్తుండగా పివిఎన్ఎస్ రోహిత్ సింగర్.



## ఆ పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే

# 'కన్నప్ప'ని తీశాం..

**- డా.మోహన్ బాబు**

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప'ను భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా.మోహన్ బాబు నిర్మించిన ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. శుక్రవారం నాడు ఈ చిత్రం నుంచి టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..డా.మోహన్ బాబు మాట్లాడుతూ..లి 'కన్నప్ప ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుంది. భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించాం. ఎంతో వ్యయప్రయాసతో నిర్మించాం. భారత దేశంలోని నాలుగు మూలల ఉన్న మహా నటుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. శరత్ కుమార్ తీసిన పెదరాయుడు సినిమాను నేను తీశాను. ఎలాంటి పాత్రనైనా అవలీలగా శరత్ కుమార్ పోషించగలరు. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. ముందుగా కన్నప్ప కోసం కృష్ణంరాజు గారితో మాట్లాడాం. విష్ణు కోసం కన్నప్ప తీయాలని అనుకుంటున్నానని చెబితే.. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కూడా కృష్ణంరాజు గారు ఇచ్చేశారు. మేం మున్ముందు ఇంకా ఎన్నో ఈవెంట్‌లు నిర్వహిస్తాం. నిర్మాతగా నాకు మాత్రమే కాకుండా.. కన్నప్ప టీంకు ప్రజలందరి ఆశీస్సులు కావాలి' అని అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ..లి ' 'కన్నప్ప'ను ప్రతీ ఒక్క ఆడియెన్ భుజానికి ఎత్తుకుని ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా అభిమానుల నుంచి వస్తున్న సపోర్ట్‌ని చూస్తూనే ఉన్నాను. అందుకే వాళ్లలోంచి కొంత మందిని ఇక్కడకు పిలిచాను. 2014లో కన్నప్ప జర్నీ ప్రారంభమైంది. 2015లో నేను కన్నప్పని డెవలప్ చేస్తూ వెళ్తుంటే.. తణికెళ్ల భరణి గారు పూర్తిగా నాకే అప్పగించారు. నా దైవం, నా తండ్రి మోహన్ బాబు గారు, విన్ని, వినయ్ ఇచ్చిన ప్రోత్సాహం వల్లే కన్నప్పను తెరపైకి తీసుకు రాగలిగాను. టీం సెట్ కాలేదు కానీ.. లొకేషన్ల కోసం వేట ప్రారంభించాను. శివుడు పర్మిషన్ ఇస్తే తీయడానికి రెడీగా ఉండాలనే అంతా సెట్ చేసి పెట్టుకున్నాను. గత ఏడాది ఆ శివుడు పర్మిషన్ ఇచ్చారు.

మేం సినిమాను తీశాం. ఆయన ఆశీస్సుల వల్లే సినిమాను తీయగలిగాం. కన్నప్ప మైథాలజీ కాదు.. కన్నప్ప మన చరిత్ర. కట్టు కథ అంటే నమ్మకండి.. రెండో శతాబ్దంలో జరిగిన కథ.అని అన్నారు.




వైవిధ్యమైన చిత్రాలతో సౌత్ ఆడియెన్స్ కు దగ్గరైన హీరో విజయ్ ఆంటోనీ "తుఫాన్" చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ సంస్థ గతంలో విజయ్ ఆంటోనీ హీరోగా రాఘవన్, హత్య సినిమాలను నిర్మించింది. పొయెటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ లో "తుఫాన్" సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. "తుఫాన్" సినిమాను త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురానున్నారు. ఈ రోజు "తుఫాన్" ఫస్ట్ సింగిల్ 'తుఫాన్ లా' రిలీజ్ చేశారు. 'తుఫాన్ లా' పాటకు భాష్యశ్రీ లిరిక్స్ అందించారు. హైమత్ మహమ్మద్ పాడారు. విజయ్ ఆంటోనీ, అచ్చు రాజమణి సంగీతాన్ని అందించారు. ' ఈ వాన నీలో ఈ క్షణం ఓ హోరై కురిసెనా.. పదే పదే ఆవేదనే నిన్నే వేధించెనా...నువ్వు నువ్వుగానే ఉన్న నీలో ఏదో యుద్ధమా..మాటలాడకున్న గుండెలోన ఇంత శబ్దమా..ఈ నిప్పు వానలే మరింత రాలేనురా, ఆ నొప్పె రేగుతూ ప్రళయాన్ని దాటేనురా, నిన్ను కాల్చుతున్న జ్వాలలన్నీ ఆర్పివేసి రా, తుఫానులా..' అంటూ సాగుతుందీ పాట. హీరో క్యారెక్టరైజేషన్‌లోని సంఘర్షణను వివరిస్తూ ఈ పాటను రూపకల్పన చేశారు.



# 'అలనాటి రామచంద్రుడు' నాన్న సాంగ్

యంగ్ అండ్ ట్యాలెంటెడ్ కృష్ణ వంశీ హీరోగా పరిచయం అవుతున్న సరికొత్త ప్రేమకథా చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. మోక్ష హీరోయిన్ గా నటిస్తున్నారు.

ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హను రాఘవపూడి ఈ సినిమా నుంచి నాన్న సాంగ్ ని లాంచ్ చేశారు. కంపోజర్ శశాంక్ తిరుపతి ఈ పాటని హార్ట్ టచ్చింగ్ బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేశారు. చిలుకూరి ఆకాష్ రెడ్డి లిరిక్స్ ఆకట్టుకునేలా వున్నాయి. అంజనా బాలకృష్ణన్, శ్రాగ్వి ప్లజంట్ వోకల్స్ ఫీల్ గుడ్ వైబ్ ని క్రియేట్ చేశాయి. ఈ మూవీలో సీనియర్ నటుడు బ్రహ్మాజీ, సీనియర్ నటి సుధ, ప్రమోదిన, వెంకటేష్ కాకమును, చైతన్య గరికిపాటి ఇతర ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ప్రేమ్ సాగర్ కెమరామెన్ గా పని చేస్తున్న ఈ చిత్రానికి జే సి శ్రీకర్ ఎడిటర్.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144